# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :07 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 28-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన నిజామాబాద్ కలెక్టర్

మాక్లూర్, ఆర్మూర్ : పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే పోలింగ్‌కు పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాదాపూర్ లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, టీచర్స్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఓటర్లను తనిఖీ చేసిన తరువాత వారి వద్ద గుర్తింపు కార్డులుంటేనే కేంద్రంలోకి అనుమతిస్తున్నారు.

## తమిళనాడుకు ఆయన ఓ ఆశాకిరణం..



తమిళనాడు: తమిళనాడు రాజకీయాల్లో మార్పును చూడాలనుకునే కోట్లాది మంది ప్రజలకు టీవీకే చీఫ్ విజయ్ కొత్త ఆశాకిరణమని రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ అన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో తమిళగ వెత్రికళగం అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టిస్తుందన్నారు. తమిళనాడులోని చంగల్పట్టు జిల్లాలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం టీవీకే రెండో వార్షిక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. ఐపీఎల్‌లో క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టును గెలిపించినట్లుగా తాను రానున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెత్రికళగంను గెలిపిస్తానని వ్యాఖ్యానించారు.'దేశంలో ఎక్కడాలేని విధంగా రాజకీయ అవినీతి తమిళనాడులో ఉంది. అవినీతి, కుటుంబ పాలన రాష్ట్రంలో పోవాలి. అలా జరగాలంటే విజయ్ లాంటి వ్యక్తి రావాలి. విజయ్‌కు వ్యూహరచనల్లో సహాయం, ఎలాంటి సలహాలూ అవసరం లేదు. ఆయన ఆలోచనలు, సమాజంపై ఉన్న ప్రేమ, బాధ్యత నాకు తెలుసు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పును చూడాలనుకునే కోట్లాది మంది ప్రజలకు విజయ్ ఓ కొత్త ఆశాకిరణం. నేను ఏ పార్టీతో, నాయకుడితో కలిసి పనిచేయనని నాలుగేళ్ల క్రితమే ప్రకటించాను. కానీ విజయ్ నాకు రాజకీయ నాయకుడు కాదు. ఆయన నాకు ఓ బ్రదర్ లాంటివాడు' అని ప్రశాంత్ కిషోర్ చెప్పుకొచ్చారు. తమిళనాడులో తమిళగ వెత్రి కళగం పార్టీ ఒక కొత్త రాజకీయ చరిత్రను సృష్టించబోతోందని ఆయన వ్యాఖ్యానించారు.

## సీఎం రేవంత్ రెడ్డివి అంతులేని అబద్ధాలు.. ఎమ్మెల్సీ కవిత ఫైర్



హైదరాబాద్ : రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి అంతులేని అబద్ధాలతో తన పరిపాలనను కొనసాగిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు.రేవంత్ రెడ్డి అంతులేని అబద్ధాలు చెబుతున్నారు. నెలకు రూ 6500 కోట్ల వడ్డీ కడుతున్నామని అబద్ధాలు చెబుతున్న సీఎం.. కాగ్ నివేదిక ప్రకారం ఏ నెల కూడా 2600 కోట్లకు మించి వడ్డీ కట్టలేదు. మరి 6500 కోట్లు కడుతున్నామని సీఎం ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు..? అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కనీసం ఇప్పుడైనా నిజాలు చెప్పాలి.అబద్ధాలు పదేపదే చెబితే నిజమవుతాయేమోనన్న భ్రమలో సీఎం ఉన్నారు. రాష్ట్ర ఆదాయంపై కూడా రేవంత్ రెడ్డి తప్పుడు లెక్కలు చెబుతున్నారు. ప్రతీ నెల 18 వేల కోట్ల ఆదాయం వస్తున్నదని సీఎం చెబుతున్నారు. కానీ కాగ్ ప్రకారం 12 వేల కోట్లకు మించి ఈ ఏడాది ఆదాయం రాలేదు. మరి ఈ అబద్ధపు లెక్కలు ఎందుకు చెప్తున్నట్లు..? ఎవరిని మభ్యపెట్టడానికి చెబుతున్నారు..? అని కవిత ప్రశ్నించారు.ఆదాయం పడిపోవడానికి ప్రధాన కారణం హైడ్రా. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 18 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ హైడ్రా విధ్వంసం వల్ల దాని ద్వారా ఆదాయం 5800 కోట్లకు పడిపోయింది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని సర్వనాశనం చేసే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్బీసీ పనులే జరగలేదని సీఎం పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. కేసీఆర్ విశాల హృదయం తెలవాలంటే ఎస్ఎల్బీసీ విషయంలో అర్థమవుతుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఈ ప్రాజెక్టుపై కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ విషయంలో అప్పటి ప్రతిపక్ష నేత జానా రెడ్డిని ముందుపెట్టి కాంట్రాక్టర్‌కు 100 కోట్లు అడ్వాన్స్ ఇచ్చారు కేసీఆర్. కరోనా తర్వాత కాంట్రాక్టర్ పనులు చేపట్టలేమంటే మళ్లీ 100 కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు 30 ఏళ్లలో ఈ ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చు 3340 కోట్లు. కానీ కేవలం 10 ఏళ్లలో కేసీఆర్ పెట్టిన ఖర్చు 3890 కోట్లు. ఇంత ఖర్చు పెట్టి 11 కీమీ మేర టన్నెల్ తవ్విస్తే ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతున్నారని కవిత మండిపడ్డారు.సొంత జిల్లాలో సొంత ఊరు పక్కన విపత్తు జరిగితే పట్టించుకోకుండా సీఎం ఢిల్లీ వెళ్లారు. 8 మంది ప్రాణాలు చిక్కుకుంటే ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఉత్తరాఖండ్‌లో టన్నెల్‌లో కార్మికులు చిక్కుకుంటే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెళ్లి వాళ్ల ప్రాణాలతో బయటపడేవరకు అక్కడే ఉన్నారు. కానీ మన ముఖ్యమంత్రికి సోయి లేదు. ఐరన్ లెగ్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నాలుగు ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటికీ అతీగతీ లేదు. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు మీద మొత్తం ప్రాజెక్టు కొట్టుకుపోతే ప్రభుత్వం స్పందించలేదు. మెఘా కృష్ణా రెడ్డి కడుతున్న ప్రాజెక్టుల గురించి మాట్లావద్దన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారు. సుంకిశాల ప్రాజెక్టు మీద ఒకరు ఆర్టీఐ వేస్తే దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి జవాబు ఇవ్వమని ప్రభుత్వం చెప్పింది అని కవిత గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు ముఖ్యమా కాంట్రాక్టర్లు ముఖ్యమా..? ప్రధానిని కలిసిన వెంటనే బీఆర్ఎస్ పని ఖతమని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికారు. మరి వీటన్నింటికి మా కుటుంబానికి, మా పార్టీకి సంబంధం ఏంటి..? ఇది కేసీఆర్‌పై, బీఆర్ఎస్ పార్టీపై సీఎం కుట్ర పన్నడమే కానీ మరొకటి కాదు. సంబంధం లేని సంఘటనల గురించి ప్రధానిని కలిసిన తర్వాత సీఎం మాట్లాడారు. దీన్ని బట్టే కుట్ర జరుగుతున్నట్లు అర్థమవుతున్నదని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్..!




హైదరాబాద్/విజయవాడ,ఫిబ్రవరి27: తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణల్లో మూడు చొప్పున 6 స్థానాల్లో గురువారం ఉదయం ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఏపీలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 16 జిల్లాల పరిధిలోని 1,062 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 70 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 6,84,593 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రం లోపల క్యూలైన్లో ఉన్నవారందరికీ ఓటేసే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానంలో 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్), గాదె శ్రీనివాసులునాయుడు (పీఆర్‌టీయూ), విజయగౌరి (యూటీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానం బరిలో 35 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ప్రధానంగా రాజశేఖరం (కూటమి) రాఘవులు (పీడీఎఫ్) మధ్య పోటీ ఏర్పడింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బరిలో 25 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ఆలపాటి రాజేంద ప్రసాద్ (కూటమి) కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. తెలంగాణలో ఉమ్మడి మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంతోపాటు ఉపాధ్యాయ నియోజకవర్గం, ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గాలకు కలిపి 90 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మూడు స్థానాల్లో ఓటింగ్ కోసం 973 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## కేంద్ర ప్రభుత్వాన్ని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారా?



న్యూఢిల్లీ,రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డా లేక నేనా?కేంద్ర ప్రభుత్వాన్ని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారా? తెలంగాణ క సంబంధించిన అన్ని ప్రాజెక్టుల విషయంలో నేను రాష్ట్ర ముఖ్యమంత్రులతో మాట్లాడుతూ నిధులు తీసుకొస్తున్నా. రేవంత్ రెడ్డి గాలి మాటలను ప్రజలు అర్థం చేసుకున్నారు. ఇలాంటి బెదిరింపులకు నేను భయపడను. నేను ఒక్క ప్రాజెక్టు అడ్డుకున్నట్టు రుజువు చూపించాలని సవాల్ చేస్తున్నా. చేతకాని, దమ్ములేని సీఎం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. మెట్రోకి సంబంధించి మొన్న ప్రతిపాదనలు పంపారు. సీఎంగా ఉన్న వ్యక్తి ఏమాత్రం అవగాహన లేకుండా దుందుడుకు వైఖరితో వ్యవహరిస్తున్నారు. మెట్రో కోసం రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఒక్క పైసా లేదు. నెపం నా మీదకు నెడుతున్నారు.నిన్న ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానితో సమావేశానంతరం మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. "తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ఐదు ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి విన్నవించాం. వాటికి అనుమతులు, నిధులు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదే. లేకపోతే వారిద్దరూ గుజరాత్‌కో.. ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలి. తెలంగాణలో వారికి తిండి దండగ. మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు. తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదు. కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనండి. నేను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తా. సన్మానం చేసి గండపెండేరం తొడుగుతా" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు.

### పోసాని అరెస్ట్ నిరంకుశ విధానం

అమరావతి,సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్టును వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఖండించారు. ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోందని మండిపడ్డారు. అరెస్ట్ నేపథ్యంలో పోసాని భార్య కుసుమలతను జగన్ ఫోన్‌లో పరామర్శించారు. అరెస్ట్ విషయంలో పోసానికి వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారని.. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. 'ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోంది. అరెస్ట్ విషయంలో పోసాని కృష్ణమురళికి వైసీపీ అండగా ఉంటుంది. రాష్ట్రంలో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారు. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలి. పోసానికి వైసీపీ పార్టీ తరుపున న్యాయ పరంగా సహాయం అందిస్తాం. పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులతో లీగల్ గా ముందుకు వెళ్తామని వైఎస్ జగన్ పేర్కొన్నారు. పోసాని కృష్ణమురళిని ఏపీ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు.

## ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం



న్యూఢిల్లీ,ఫిబ్రవరి27: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు.మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా,యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహాకుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ,సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

## రేవంత్‌రెడ్డి ధన దాహం వల్లే.. ప్రమాదంలో 8 మంది కార్మికుల ప్రాణాలు!



హైదరాబాద్,తన అసమర్థతను, పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి గత ప్రభుత్వంపైన నెపం నెడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం ఓ జాతీయ మీడియా సంస్థతో ఆయన మాట్లాడారు.ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు రేవంత్ రెడ్డి వ్యవహారం ఉందన్నారు. జీఎస్ఐ, ఇంజనీరింగ్ నిపుణులు వంటి సంస్థలతో సంప్రదించకుండానే ఆగిపోయిన ప్రాజెక్టుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా అవినీతి సొమ్ముల కోసం లాలూచీ పడి పాత యంత్రాలతో ప్రారంభించారని విమర్శించారు. కేవలం రేవంత్ రెడ్డి ధన దాహం వల్లనే ఈరోజు 8 మంది కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారని ఆరోపించారు. వారు బతికున్నారో లేదో అనే ఆందోళనకరమైన పరిస్థితి నెలకొందన్నారు. దీనికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డిదే అన్నారు. రేవంత్ రెడ్డి కార్మికులను రక్షించాల్సింది పోయి బ్లేమ్ గేమ్ ప్రారంభించారని ఆరోపించారు. దేవుడిచ్చిన ముఖ్యమంత్రి అవకాశాన్ని వాడుకొని ప్రజలకు మంచి చేయాల్సింది పోయి రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చింది కాబట్టి తెలంగాణకు మంచి జరిగేలా ప్రజలకు మంచి జరిగేలా వ్యవహరించాలని సూచించారు. చీఫ్ మినిస్టర్ గా మాట్లాడాలి కానీ ఒక చీప్ మినిస్టర్ గా మాట్లాడవద్దని రేవంత్ రెడ్డికి సూచిస్తున్నాన్నారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాకనే రాష్ట్రంలో జరుగుతున్న మరణాలపైన ఇతరుల పేరును ప్రస్తావిస్తున్నారని చెప్పారు.అధికారంలో తామే ఉన్నామన్నది మరిచిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. "రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కావాల్సిన విచారణలు దర్యాప్తులు చేసుకోవచ్చు. కానీ కేవలం టైంపాస్ చేసేందుకు పరిపాలనను పక్కనపెట్టి చేతకాకనే ఇవన్నీ మాట్లాడుతున్నారు. అరచేతిలో స్వర్గం చూపించేలా ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకనే ప్రజల టెన్షన్ డైవర్షన్ కోసం ముఖ్యమంత్రి ఇవన్నీ మాట్లాడుతున్నారు. 15 నెలల నుంచి కేవలం ప్రజల అటెన్షన్ డైవర్షన్ పేరుతో ఆటలాడుతున్న రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టారు. రేవంత్ రెడ్డి అన్ని విషయాల్లో అబద్ధాలు ఆడుతున్నారు. రాష్ట్ర అప్పుల విషయంలో కూడా అబద్ధాలు ఆడుతున్నారు. 6500 కోట్లు కేవలం వడ్డీ లెక్క అయిపోతుందంటూ రాష్ట్ర ప్రజలను, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. రేవంత్ రెడ్డికి ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన లేదు." అని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణలు చేశారు.

## హిందీ-సంస్కృతం.. 25 ఉత్తరాది భాషలను నాశనం చేశాయి



చెన్నై: హిందీ భాషకు వ్యతిరేకంగా తమిళనాడు తన పోరాటాన్ని ఉధృతం చేసింది. ఆ భాషను ఎట్టి పరిస్థితిలో అమలు చేయబోమని ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. తమిళ భాషను, తమిళ సంస్కృతిని కాపాడుకునేందుకు పోరాటం చేస్తానన్నారు. హిందీ భాషను కచ్చితంగా నేర్చుకోవాలన్న నిబంధనను వ్యతిరేకిస్తున్నామని, హిందీ భాష ఓ మాస్క్ అయితే, సంస్కృతం ఓ కనిపించని ముఖం అన్నారు. పార్టీ కార్యకర్తలకు రాసిన లేఖలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.మూడు భాషలు నేర్చుకోవాలని కేంద్ర సర్కారు కొత్తగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తెచ్చిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర నిర్ణయాన్ని డీఎంకే వ్యతిరేకిస్తున్నది. బీహార్, యూపీ, మధ్యప్రదేశ్‌లో మాట్లాడే మిథిలీ, బ్రజ్‌భాషా, బుందేల్‌ఖండ్, అవధి లాంటి స్థానిక భాషలు.. హిందీ భాష ఆధిపత్యం వల్ల నాశనమైనట్లు స్టాలిన్ తన లేఖలో తెలిపారు. హిందీ-సంస్కృత భాషల ఆధిపత్యం వల్ల ఉత్తరాదికి చెందిన సుమారు 25 ప్రాచీన భాషలు అంతరించిపోయినట్లు స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. శతాబ్ద కాలం నాటి ద్రవిడ ఉద్యమం వల్ల.. తమిళ భాష, సంస్కృతిని రక్షించుకునట్లు చెప్పారు.మూడు భాషల పాలసీ షెడ్యూల్ ద్వారా.. చాలా వరకు రాష్ట్రాల్లో సంస్కృతాన్ని మాత్రమే ప్రమోట్ చేస్తున్నారని స్టాలిన్ ఆరోపించారు. బీజేపీ పాలిత రాజస్థాన్‌లో.. ఉర్దూ టీచర్లకు బదులుగా సంస్కృత టీచర్లను రిక్రూట్ చేస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ తమిళనాడులో త్రిభాషా విధానాన్ని అమలు చేస్తే, అప్పుడు మాతృభాషని పట్టించుకోరు అని, భవిష్యత్తు అంతా సంస్కృతమే అవుతుందని స్టాలిన్ తెలిపారు. ద్రవిడ నేత, దివంగత మాజీ సీఎం సీఎన్ అన్నాదురై.. తమిళనాడులో ద్విభాషా విధానం అమలుకు ప్రాముఖ్యత ఇచ్చినట్లు చెప్పారు. హిందీ-సంస్కృతం అమలు వల్ల తమిళ సంస్కృతి నష్టపోతుందని ఆయన అంచనా వేసినట్లు స్టాలిన్ చెప్పారు.

## సంపాదకీయం

**శుక్రవారం 28-02-2025**

# 'సంస్కరణ'ల దిశ

రా ష్ట్ర బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ సోమవారం ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం కార్పొరేట్ సంస్కరణల మార్గాన్ని ఆవిష్కరించింది. కేంద్రంలోని మోడి ప్రభుత్వం నుంచి జాలువారిన వికసిత భారత్ లక్ష్యాల వెలుగులో సృష్టించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' అమలు ద్వారా సంపన్న, ఆరోగ్య, సంతోషకర రాష్ట్రాన్ని నిర్మిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం గవర్నర్ చేత చెప్పించింది. వికసిత భారత్ డాక్యుమెంట్ మొత్తం అదానీ, అంబానీ, బడా కార్పొరేట్ల దోపిడీకి పూచీ పడుతుంది. ఆ 'వికసిత భారతే' తమకు మూలం అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినందున 'స్వర్ణాంధ్ర విజన్' కూడా కార్పొరేట్ల దారేనని భావించాలి. రాబోయే 23 ఏళ్ల విజన్‌కు ప్రణాళిక వేసి అందులో తొలి ఐదేళ్లకు లక్ష్యాలను నిర్ణయించి వాటి సాధనకు విధాన పత్రాలు ప్రకటించింది టిడిపి కూటమి ప్రభుత్వం. విజన్ పత్రం, దాని సాధనకు ఎంచుకున్న పాలసీలు నయా-ఉదారవాద విధానాల చట్రంలో తయారయ్యాయి. వాటినే గవర్నర్ ప్రసంగంలో గుదిగుచ్చి తమ దారి 'సంస్కరణల' రహదారి అని మరింత గట్టిగా ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేసింది. కాగా ఈ గవర్నర్ ప్రసంగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. రాబోయే సంవత్సరానికి, ఆ మాటకొస్తే వచ్చే నాలుగున్నరేళ్లకూ దశా దిశాను తెలుపుతుంది. ఆ లెక్కన చూస్తే నిర్మితమయ్యేది కార్పొరేట్ ప్రభావిత రాష్ట్రమని గవర్నర్ ప్రసంగంతో అర్థమవుతుంది. తమ పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఉంటుందని గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం ఎప్పుడూ పాడే పాటే పాడింది. తామొచ్చాక మొదలెట్టిన సామాజిక పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న కాంటీన్ల పునరుద్ధరణ వంటి పథకాలను గొప్పగా వల్లె వేసిన సర్కారు, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీల అమలు ఎప్పుడో నిర్దిష్టంగా పేర్కొనకపోవడం ఆయా వర్గాలను నిరాశ పర్చింది. రైతులకు అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు తప్ప ఎప్పటి నుంచో తెలపలేదు. గవర్నర్ మరోసారి కూటమి మేనిఫెస్టోను సోదహరణంగా ఒప్పజెప్పారంతే. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు గత వైసిపి వైఫల్య పాలనే కారణమని ఎనిమిది నెలలుగా ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఇప్పుడు కూడా అదే చెబితే చాలదు. పథకాల లబ్ధి, వాగ్దానాల అమలు కోసం ఎంతో ఆశతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ నడకను వెల్లడించే గవర్నర్ ప్రసంగంలో హామీల అమలుపై స్పష్టత రాకపోవడంతో ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు కలగడం సహజం. బడ్జెట్ వస్తే ప్రభుత్వ అసలు నైజం బయట పడుతుంది. గవర్నర్ ప్రసంగంలో అసంబద్ధ, వాస్తవ విరుద్ధ విషయాలు చాలానే ఉన్నాయి. 'నేడు ఏ ఒక్క రైతూ కష్టాల్లో లేడని చెప్పడానికి గర్విస్తున్నాం' అని సర్కారు పేర్కొనడం ఏ స్థాయి స్వోత్కర్షనో అసెంబ్లీకి కూత వేటు దూరంలో ఉన్న గుంటూరు మిర్చియార్డులో ధర లేక రైతులు పడుతున్న అగచాట్లే నిదర్శనం. వ్యవసాయాన్ని టెక్నాలజీతో కొత్త పుంతలు తొక్కిస్తామనడం, డ్రోన్ల వినియోగం వంటివెన్నో వల్లె వేశారు తప్ప పంటలకు గిట్టుబాటు ధర, ఎంఎస్‌పికి చట్టబద్ధత, కౌలు రైతులెదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలను విస్మరించారు. లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఇవన్నీ అంతిమంగా కార్పొరేట్లకు లాభించేవే. విద్య, ఆరోగ్యం, తాగునీరు, విద్యుత్, ఒక్కటేమిటీ%ొ% అన్నింటిలోనూ 'సంస్కరణల' ప్రస్తావనే. పి-4 జపమే! గిరిజన ప్రాంతాల అభివృద్ధి, వారి సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి, ఎస్‌సిల అభ్యున్నతి ఇవన్నీ మాటలకే పరిమితం. సబ్‌ప్లాన్ ఊసే లేదు. బిసిల రక్షణకు తెస్తామన్న చట్టానికి రోడ్‌మ్యాప్ రూపొందిస్తామనడం ఊరించడానికేననిపిస్తుంది. మహిళలపై దాడుల గురించి మర్చిపోయారు. ప్రత్యేక హోదా ప్రస్తావన లేకుండా, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి చెప్పకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనడం కేంద్ర బిజెపి ప్రభుత్వానికి నొప్పి కలిగించకూడదనే. 15 శాతం వృద్ధి, తలసరి ఆదాయం లక్ష్యం రూ.58 లక్షలు, 308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ ఇటువంటి గాలిలో మేడలు కట్టే మాటలకు గవర్నర్ ప్రసంగంలో కొదవ లేదు.

# మోడీ ద్వయం ఏమి చేయబోతున్నది ..?

న్యూఢిల్లీ,ప్రధాని మోడీ, అమిత్‌షాలు నిశ్శబ్దంగా ఉన్నారంటే ఎవరికో మూడినట్లే. వారు ఏదైనా అలజడి సృష్టించే ముందు ప్రశాంతంగా ఉంటారు. ఎవ్వరికీ అంతుచక్కకుండా ఉంటారు. వారి వ్యూహాలను పసిగట్టడం వారితో ఉన్నా వారికి కూడా తెలియదు. కాంగ్రెస్ ముక్తభారత్ నినాదంతో రాజకీయాలు నెరిపిన మోడీ కొంతవరకు విజయం సాధించారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు పార్లమెంటులో ప్రతిపక్ష హోదా లేకుండా చేశారు. అయితే ఇదొక్కటే చేయడం వల్ల ప్రజలు హర్షించరు..గుర్తించరని వారు గమనించలేక పోయారు. అందుకే గత ఎన్నికల్లో కాంగ్రెస్ వందసీట్లు గెల్చుకుని ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంటులో అడుగుపెట్టింది. ఆ పార్టీ కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. వయనాడ్‌తో పాటు రాయబరేలీలో కూడ రాహుల్ గెలిచి, వయనాడ్‌లో చెల్లెలు ప్రియాంకను మెల్లంగా లోక్‌సభ గడప తొక్కేలా చేశారు. అంతకుముందే తల్లి సోనియా రాజ్యసభలో చేరారు. మొత్తంగా కుటుంబం అంతా పార్లమెంటులో ఉన్నారు. ఇక మిగిలింది రాబర్ట్ వాద్రా మాత్రమే. ఆయన కూడా కర్నాటక లేదా తెలంగాన నుంచి రాజ్యసభ మెట్లు తొక్కినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. అయితే ఇదంతా కాంగ్రెస్ వైపు కనిపిస్తున్న కోణం. మోడీ కోణం మరోటిగా ఉంది. కేవలం 240 సీట్లకే పరిమితమైన బిజెపి, మొన్నటి ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ సాధించలేకపోయింది. ఈ క్రమంలో మళ్లీ కమలం ఆపరేషన్ మొదలవుతుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. తమ కాంగ్రెస్ ముక్త భారత్ వ్యూహంలో భాగంగా మెల్లగా అడుగులు వేసే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ మరో ఐదేళ్ల వరకు అధికారం కోసం వేచిచూడక తప్పదు. ఈలోగా పార్టీలో ఉన్న వృద్ధనేతలకు అంతకాలం వేచిచూసే ఓపిక ఉండదు. రాజకీయాల్లో ఇప్పుడు తమ వయసురీత్యా కూడా రాజకీయాలు నెరపుతున్నారు. తాజాగా శశిథరూర్ మోడీకి దగ్గరవుతున్నారన్న సంకేతాలు...తుఫాన్‌కు ముందు ప్రశాంతత లాంటివనే చెప్పాలి. అయితే తాను పార్టీ వీడడం లేదని శశిథరూర్ స్పష్టం చేసారు. ప్రతి రాజకీయవేత్త పార్టీ మారు క్రమంలో చేసే సాధారణ ప్రకటన ఇది. అయితే ఒక్క శశిథరూర్ కోసం మోడీ ద్వయం ప్రయత్నించదని గుర్తించాలి. ఆయనతోపాటు మరికొందరి కోసం గాలం వేసివుంటారు. కాంగ్రెస్‌ను చీల్చి చెండాడడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నారు. రాహుల్ నాయకత్వం పట్ల విశ్వాసం లేని వారు వీరివలలో పడడం ఖాయం. కేరళలో సొంతంగా ప్రజలలోఇమేజ్‌ను ఆసరా చేసుకొని వరుసగా నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైన మాజీ కేంద్ర మంత్రి శశిథరూర్ ఇప్పుడు పార్టీలో తిరుగులేని నేతగా వెలుగొందుతున్న రాహుల్ గాంధీపై తిరుగుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నారు. వరుసగా హర్యానా,మహారాష్ట్ర, ఢిల్లీలలో ఘోర పరాజయాలు మూటగట్టుకున్న తర్వాత 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పార్టీలు అన్ని దూరం అవుతున్న సమయంలో శశిథరూర్ వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ శ్రేణులను కలవరం పరుస్తున్న మాట నిజం. 2019లో పార్టీ పరాజయం తర్వాత, 2020లో ఐదుగురు మాజీ ముఖ్యమంత్రులు, పలువురు ఎంపిలు, మాజీ కేంద్ర మంత్రులతో కలిసి 23 మంది పార్టీ అధినేత్రికి రాసిన లేఖలో సైతం తిరుగుబాటు ధోరణి ప్రదర్శించారు. ఈ క్రమంలో గులాం నబీ ఆజాద్, కపిల్ సిబల్ లాంటి వారు తమదారి తాము చూసుకున్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ఇకముందు సంపూర్ణ మెజార్టీతో తిరిగి అధికారంలోకి వస్తుందని నేతలకు నమ్మకం పోయింది. అందుకే శశిథరూర్ తిరుగుబాటును ఆ విధంగా కొట్టిపారివేయ లేము. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అక్టోబర్, 2022లో జరిగిన ఎన్నికల్లో గాంధీ కుటుంబం బలపరిచిన



మల్లికార్జున్ ఖర్గేపై పోటీ చేసి మొత్తం 5000 మంది ఓటర్లలో 1500కు పైగా ఓట్లు సంపాదించడం పార్టీలో విస్తృత ప్రతిపాదికలో థరూర్‌కు గల మద్దతును తెలుపుతున్నది. నిజంగా ఆ నాడు థరూర్‌ను పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకొని ఉంటే నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ బలమైన ప్రాతిపదికను ఏర్పరచుకొని ఉండేదని పలువురు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ను కలిసేందుకు ప్రధాని మోడీ ప్రత్యేకంగా అమెరికాకు వెళ్లిన సందర్భంలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు తీవ్రమైన విమర్శలు గుప్పిస్తే, శశిథరూర్ మాత్రం ఫలవంతమైన పర్యటన అని పొగడ్తలతో ముంచెత్తారు. అక్రమ వలసదారులు అమానుష రీతిలో పంపడాన్ని మోడీ ప్రస్తావిస్తే బాగుండెడిది అని చురకలు అంటిస్తూనే టారిఫ్‌ల విషయంలో వెంటనే ట్రంప్ కఠిన నిర్ణయం తీసుకోకుండా చర్చల పేరుతో వాయిదా వేయగలిగారని కొనియాడారు. తమ రాజకీయ ప్రత్యర్థులను థరూర్ పొగడ్తలతో ముంచెత్తడం సహజంగానే కాంగ్రెస్ నేతలకు ఆగ్రహం కలిగించింది. విదేశీ పర్యటనలో ఉన్న థరూర్ తో వెంటనే మాట్లాడాలని స్వయంగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. ఫిబ్రవరి 18న రాహుల్‌ను కలిసిన థరూర్ తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో తన పాత్ర ఏమిటో ముందు స్పష్టం చేయమని రాహుల్ గాంధీని నిలదీశారు. పార్లమెంట్ చర్చలలో పార్టీ ప్రతినిధిగా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, పార్టీలో సైతం తనకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఏ కమిటీలో తనకు అవకాశం ఇవ్వడం లేదని నిలదీశారు. ఈ విషయాలపై ఎటువంటి సమాధానం ఇవ్వలేక రాహుల్ గాంధీ మౌనం వహించినట్లు తెలుస్తున్నది. అంతేకాదు, తాను ఇప్పటికీ పార్టీకి అందుబాటులోనే ఉన్నానని చెబుతూనే తన అవసరం లేదని పార్టీ భావిస్తే తనకూ వేరే మార్గాలు ఉన్నాయని ఆ తర్వాత స్పష్టంగా హెచ్చరించారు. అంటే థరూర్ ధిక్కార ధోరణి మొదలయ్యిందనే చెప్పాలి. ఇక్కడ ఒక్క థరూర్ మాత్రమే మనకు పైకి కనిపిస్తున్నారు. కానీ కాగ్రెస్ పుట్టి ముంచడానికి అనేకులు సిద్దంగా ఉండివుంటారు. కాంగ్రెస్‌కు బీటల వేయడంలో థరూర్ అడుగు వేస్తే మరికొందరు ముందుకు రావచ్చు. మహారాష్ట్ర తరహాలో కాంగ్రెస్ చీలిక అనివార్యం కావచ్చు. మోడీ ద్వయం ప్రశాంతతకు ఇది కారణం కూడా కావచ్చు. రాజకీయాల్లో ఏదైనా జరగవచ్చు. జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి వంటి సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో తమ పీఠాన్ని బలోపేతం చేసుకునే పనిలో మోడీ ద్వయం ఏమైనా చేసే అవకాశం ఉంది.

# కేసీఆర్, జగన్ ఎమ్మెల్యేలుగా గెలిచి అసెంబ్లీకి వెళ్లక పోవడం ప్రజా తీర్పును అవమానించడమే




హైదరాబాద్,ఏపీలో జగన్, తెలంగాణలో కేసీఆర్ ఎమ్మెల్యే లుగా గెలిచి అసెంబ్లీకి వెళ్లక పోవడం ప్రజా తీర్పును అవమానించడమేనని అన్నారు. ఒకవేళ అసెంబ్లీకి వెళ్లకుంటే వారు రాజకీయ సన్యాసం తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణసూచించారు. కేసీఆర్, జగన్ తో పాటు మోడీ తీరు పై విమర్శలు చేశారు. అదే విధంగా రాజకీయ పార్టీలపై కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం రోజు రోజుకూ పెరిగిపోతున్నదని, ఇది సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా మంగళవారం నారాయణ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనదైన పద్ధతిలో స్పందించారు. ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ శక్తులు బలపడుతూ రాజకీయాలను శాసిస్తున్నారని, అమెరికాలో ఎలాన్ మస్క్, ఇండియాలో ఆదానీ ఒక్కటవుతున్నారని అన్నారు. నేడు రాజకీయ శక్తులను డామినేట్ చేసేలా కార్పొరేట్ శక్తులు ఎదిగారని అన్నారు. కార్పొరేట్ శక్తులు ప్రజలకు సేవ చేయరని, వారికి లాభం ఒక్కటే లక్ష్యం అని అన్నారు.

మోడీ చేతిలో రాజ్యాంగ సంస్థల నిర్వీర్యం

ప్రపంచంలో అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయించాలనుకోవడం, కమ్యూనిస్టు దేశాలను బలహీన పరచడం చేసినట్లుగానే దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తమ మాట వినని వారిపై రాజ్యాంగ సంస్థల చేత దాడి చేయించి దారికి తెచ్చుకుంటున్నారని నారాయణ అన్నారు. మోడీ పాలనలో గజదొంగలను, దోపిడీ దారులను వెనకేసుకు రావడం వలన మొత్తం వ్యవస్థ దెబ్బ తిన్నదని అన్నారు. జ్యుడీషియల్ లో సైతం తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు పదవులు కట్టబెట్టారని, జ్యుడీషియల్ తో సహా ఎన్నికల కమిషన్, ఈడి,సీబీఐ లాంటి సంస్థలను మోడీ తన గుప్పిట్లో పెట్టుకున్నారని అన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఒకటే ప్రభుత్వం ఉంటే డబుల్ ఇంజన్ సర్కారులా అభివృద్ధి జరుగుతుందంటే మరి మణిపూర్, కేంద్రంలో ఒకే ప్రభుత్వం ఉన్నా ఎందుకు విఫలమయ్యాయని ప్రశ్నించారు. ప్రస్తుతం జమిలి ఎన్నికల పేరుతో ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ కొత్త నాటకానికి తెర తీశారని, ఇది రాష్ట్రాల స్వతంత్రను నియంత్రించడమేనని అన్నారు.

ఎంపీ ఎన్నికల్లో తగ్గిన మోడీ ప్రభావం

మోడీ పాలన బాగా ఉంటే 303 సీట్ల నుండి 242 ఎంపీ స్థానాలకు ఎందుకు పడిపోయారని నారాయణ అన్నారు. దేశంలోనే ఏ ప్రధానికి రానంత తక్కువ మెజారిటీతో మోడీ గెలిచారని, చంద్రబాబు,నితీష్ లను లొంగదీసి కొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. మొన్నటి డిల్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ ఇచ్చిన లిక్కర్ కుంబకోణం డబ్బును తీసికొని ఆప్ ఓడిపోయిందని, ఆ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, ఆప్ కలవకుండా మోడీ ఆప్ ను బ్లాక్ మెయిల్ చేశారని అన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్,తెలంగాణాలోనూ ఇలాంటి బ్లాక్ మెయిల్ రాజకీయాల ద్వారా పార్టీలను బీజేపీ గుప్పిట్లో పెట్టుకుంటున్నదని అన్నారు. దేశంలో రాజకీయ పార్టీలు ఏం చేసినా మార్పు కోసం కమ్యూనిస్టు లుగా తాము ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేసిన బీఆరెఎస్

తెలంగాణను బీఆర్‌ఎస్ అప్పుల కుప్ప చేయడం వల్ల నిధులు లేక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక పోతున్నదని నారాయణ అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణా ను 7లక్షల కోట్ల అప్పులలోకి బీఆర్‌ఎస్ నెట్టివేసిందని అన్నారు. రాష్ట్రంలో అన్ని రకాల వ్యవస్థలను బీఆర్‌ఎస్ చెడగొట్టిందని, వాటిని అధిగమించడానికి రేవంత్ సర్కారు తంటాలు పడుతున్నదని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ లు ఒక్కటేనని, అందువల్ల తాము అప్పుడే వాటికి వ్యతిరేకంగా నిలబడిన కాంగ్రెస్ ను విమర్శించబోమని అన్నారు. తమకు రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నా ప్రజల కోసం పోరాడు తామని, కమ్యూనిస్టుల పునరేకీకరణ కు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో జరిగిన కులగణనను స్వాగతిస్తున్నామని, దాని వలన రాజకీయాల్లో గుత్తాధిపత్యం పోతుందని, కులగణన వలన రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సిపిఐ కి రెండు ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని ఎన్నికల పొత్తులో భాగంగా మాట ఇచ్చిందని,దానికి కట్టుబడి ఉండాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి,జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్,వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, బత్తిని సదానందం, మాలోతు శంకర్, కామెర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాగ్‌రాజ్‌లో నాగసాధువులు

ప్రయాగరాజ్,:మహా కుంభమేళా చివరి రోజు కావడంతోభక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 45 రోజుల పాటు జరుగుతున్న ఈ వేడుకకు ఇప్పటివరకు 65 కోట్లమందికిపైగా భక్తులు హాజరయ్యారు. చివరి రోజు మహాశివరాత్రి సందర్భంగా నాగ సాధువులు కాశీ విశ్వనాథ ఆలయం వైపు వెళ్లి శివుడికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందుకు సంబంధించిన దృశ్యాలను డ్రోన్ విజువల్స్ ద్వారా షూట్ చేశారు. ఈ వీడియోలో ఒకేసారి అనేక మంది సాధువులు ఒక్కసారిగా వెళ్లిన దృశ్యం ఆకట్టుకుంటోంది. ఇది ఆధ్యాత్మికంగా కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పవచ్చు. నాగ సాధువులు కుంభమేళా ముగిసిన తర్వాత, తమ ఆధ్యాత్మిక సాధన కొనసాగించడానికి మళ్లీ హిమాలయాలకు తిరిగి వెళతారు. నాగ సాధువులను సాధారణంగా హిందూ సన్యాసులుగా పరిగణించబడతారు. వీరు సాధారణ జీవనం వదిలేసి ఆధ్యాత్మికతను పాటిస్తూ కఠినమైన ధ్యానం, యోగా, ప్రార్థనలను చేస్తారు. అయితే ఈసారి మహా కుంభమేళా ముగుస్తున్న తరుణంలో మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలను కూడా ఇక్కడ తెలుసుకుందాం. వచ్చే ఐదేళ్లలో హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్, ప్రయాగ్ రాజ్ ప్రాంతాల్లో కుంభమేళా జరగనుంది. 2027లో హరిద్వార్‌లో అర్ధ కుంభమేళా నిర్వహించనున్నారు. అర్ధ కుంభమేళా అంటే ఆరేళ్లకు ఒకసారి వస్తుంది. పూర్ణ కుంభమేళా ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. చివరి అర్ధ కుంభమేళా 2021లో హరిద్వార్‌లో జరిగింది. ఈ క్రమంలో 2027లో అర్ధ కుంభమేళా నిర్వహించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. మరోవైపు 12 ఏళ్ల తర్వాత వస్తున్న పూర్ణ కుంభమేళా ఈసారి 2027లో నాసిక్‌లో జరగనుంది.

# శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

హైదరాబాద్,శంషాబాద్ విమానాశ్రయంలో సరైన సమయానికి గమ్యస్థానాలకు చేర్చాల్సిన విమానాలు ఇలా ఆలస్యం అవడం పట్ల ప్యాసింజర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా.. మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానం ఆలస్యం అవడమే ఇందుకు కారణం. స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో మూడు గంటలుగా విమానం కోసం ప్రయాణికులు ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి. మూడు గంటలు అవుతున్నప్పటికీ విమానం ఇంకా బయలుదేరకపోవడంపై ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ముఖ్యంగా ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన ప్రయాణికులు విమానం ఆలస్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పైస్ జెట్‌లో సాంకేతిలోపం తలెత్తిన నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సిబ్బంది ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై ప్రయాగ్రాజ్ వెళ్లే ప్రయాణికులు మండిపడుతున్నారు. కాగా.. ఇదే నెలలోనే ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం ఐదున్నర గంటల పాటు ఆలస్యంగా నడిచిన విషయం తెలిసిందే. ఈనెల 7న హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన విమానం ఆలస్యం అవడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఉదయం 10:30 గంటలకు బయలుదేరాల్సిన దాదాపు ఐదున్నర గంటలు ఆలస్యమైంది. ఐదు గంటల పాటు విమానాశ్రయంలో ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికుల్లో హీరో విజయదేవరకొండతో పలువరు సినీ ప్రముఖులు ఉన్నారు. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు, ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులు కూడా ఉన్నారు. అయితే కనీస సమాచారం ఇవ్వకుండా గంటల తరబడి వెయిట్ చేయించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు రోజు కూడా టేకాఫ్ తీసుకునేందుకు రన్‌వే వెళ్లిన విమానం ఇంజిన్ మొరాయించడంతో నిలిచిపోయింది. గుహవాటి వెళ్లాల్సిన ఇండియర్ ఎయిర్‌లైన్స్ విమానం రన్‌వే పైకి వచ్చి టేకాఫ్ అవుతున్న సమయంలో ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని గమనించిన పైలెట్ వెంటనే ఏటీసీ అధికారులు సమాచారం ఇచ్చారు. వెంటనే ఇంజనీరింగ్ నిపుణులు అక్కడకు చేరుకుని దాదాపు గంట పాటు శ్రమించి లోపాన్ని సరిచేశారు. ఆ తరువాత విమానం గుహవాటికి బయలుదేరి వెళ్లింది. అయితే రన్‌వేకు పైకి వెళ్లిన విమానం తిరిగి పార్కింగ్ బే వైపు రావడంతో ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అయితే తిరిగి గంటన్నర ఆలస్యంగా విమానం బయలుదేరడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# స్పా సెంటర్స్ టార్గెట్ ...

హైదరాబాద్: నగరానికి చెందిన ఓ ముఠా పశ్చిమ మండలంలోని స్పా సెంటర్లను టార్గెట్‌గా చేసుకుంది. ఆయా సెంటర్లకు కస్టమర్‌గా వెళ్లి, అసాంఘిక కార్యకలాపాల రంగు పూసి, సోదాలు చేసి, భయభ్రాంతులకు గురి చేసి, సెటిల్‌మెంట్‌కు పిలిచి, అందినకాడికి దండుకుంటోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ సహా అనేక చోట్ల పంజా విసిరిన ఈ ముఠా ఇప్పటికి దాదాపు రూ.50 లక్షల వరకు కొల్లగొట్టినట్లు సమాచారం. ఈ గ్యాంగ్‌కు కొందరు పోలీసులు కూడా సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఫోన్ చేసి, కస్టమర్‌గా వెళ్లి...

వెస్ట్‌జోన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్పా లేదా మసాజ్ సెంటర్ వద్ద రెక్కీ నిర్వహిస్తున్న ఈ ముఠా అనువైన దాన్ని టార్గెట్ చేసుకుంటోంది. కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్‌లోనూ వీటిని ఎంపిక చేసుకుంటోంది. ఆపై దాని ఫోన్ నెంబర్ సేకరించే ఈ ముఠా సభ్యుడు నిర్వాహకులకు కాల్ చేస్తాడు. కస్టమర్ మాదిరిగా మాట్లాడుతూ ఆయా సెంటర్లు అందించే సేవలు, వాటి రుసుముల్ని తెలుసుకుంటాడు. ఈ తంతు పూర్తయిన తర్వాత వినియోగదారుడి మాదిరిగా ఆ సెంటర్‌కు వెళ్లే అతగాడు తనతో పాటు కండోమ్ ప్యాకెట్లు తీసుకువెళ్తాడు. ఇతడు వెళ్లే సమయంలో మిగిలిన ముఠా సభ్యులు ఆ సెంటర్‌కు సమీపంలోనే వేచి ఉంటారు. స్పా సెంటర్‌లోకి వెళ్లిన ముఠా సభ్యుడు అదును చూసుకుని తనతో తెచ్చిన కండోమ్ ప్యాకెట్లను మసాజ్ టేబుల్ కింద పడేస్తాడు. ఆ తర్వాత మిగిలిన వారికి సందేశం ఇచ్చి పోలీసుల మాదిరిగా రమ్మంటాడు.

దాడి చేసి, హడావుడి చేస్తూ....

ఈ సందేశం అందుకున్న వెంటనే సమీపంలో వేచి ఉన్న ముఠా సభ్యులు పోలీసుల మాదిరిగా ఆ సెంటర్‌పై దాడి చేస్తారు. తొలుత సీసీ కెమెరాలను ఆపేసి, వాటి దృశ్యాలు రికార్డు అయ్యే డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) స్వాధీనం చేసుకుంటున్నారు. స్పా మొత్తం సోదాలు చేస్తున్నట్లు నటిస్తూ తమ ముఠా సభ్యుడు ఉన్న గదిలోకి వెళ్తారు. అక్కడి టేబుల్ కింద పడి ఉండే కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతడితో పాటు థెరపిస్టును 'అదుపులోకి' తీసుకుంటారు. వీటి ఆధారంగా ఆ స్పాలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ హడావుడి చేసి నిర్వాహకులను పూర్తి భయభ్రాంతులకు గురి చేస్తారు. వాళ్లు పూర్తిగా తమ ట్రాప్‌లో పడ్డారని నిర్ధారించుకున్న తర్వాత మరో అంకానికి తెరలేపుతారు. ముఠాకు చెందిన ఓ సభ్యుడు స్పా సెంటర్ నిర్వాహకులకు సహాయం చేస్తున్నట్లు ముందుకు వచ్చి వారితో మాట్లాడతాడు. సెంటర్‌లో ఏ తప్పు జరగట్లేదని తాను నమ్ముతున్నానని, ఈ విషయాన్ని తాను సెటిల్ చేస్తానంటూ చెప్తాడు. అటు నిర్వాహకులు, ఇటు పోలీసులుగా వచ్చిన తమ ముఠా సభ్యులతో మాట్లాడుతూ రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నాడు. ఈ తంతు మొత్తం అయితే అదే స్పా సెంటర్‌లో లేదంటే మరో ప్రాంతంలోని రెస్టారెంట్‌లో జరుగుతోంది. కాగా అప్పుడప్పుడు స్పా సెంటర్ల కేంద్రంగా జరిగే అసాంఘిక కార్యకలాపాలు వెలుగులోకి వస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్‌తో పాటు శాంతిభద్రతల విభాగం అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి వివాదాలను క్యాష్ చేసుకుంటూ ఈ ముఠా తమ దందా కొనసాగిస్తోంది. ఇలా ఈ గ్యాంగ్ ఇప్పటి వరకు పశ్చిమ మండలంలోని పలు సెంటర్లపై పంజా విసిరి దాదాపు రూ.50 లక్షల వరకు కొల్లగొట్టినట్లు తెలిసింది. ఈ ముఠాకు సహకరిస్తున్న వారిలో కొందరు పోలీసులు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# శైవక్షేత్రాల్లో భక్తుల సందడి

హైదరాబాద్,మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగుతున్నాయి. శివుడిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాళేశ్వరం, వేములవాడ, కీసర తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేములవాడ రాజన్న క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మార్మోగిపోతోంది. భక్తులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి.. దర్శనానికి క్యూ లైన్లో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి ఆరు గంటల సమయం పడుతోంది. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి అద్దాల మండపంలో అనువంశిక అర్చకులచే మహాలింగార్చన కార్యక్రమం ఉంటుంది. రాత్రి లింగోద్భవ సమయంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం జరగనుంది. కాళేశ్వరం క్షేత్రంలో మహాశివరాత్రి శోభ కనిపిస్తోంది. తెలంగాణతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుండి భక్తులు కాళేశ్వరంకు తరలివస్తున్నారు.

# సొంతంగా ప్రాంతీయ పార్టీ పెట్టే యోచనలో ఎంపి

తిరువనంతపురం, కేరళ రాజకీయాల్లో కీలక భూమిక పోషించేందుకు కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ రాజకీయంగా పావులు కదుపుతున్నారా అన్న చర్చ మొదలయ్యింది. ఇక్కడ సొంతంగా ఇమేజ్ ఉన్న నేతగా శశిథరూర్ ప్రయత్నాలు మొదలు పెట్టారని అనుకుంటున్నారు. అదే నిజమైతే ఓ ప్రాంతీయ పార్టీతో థరూర్ ముందుకు రావచ్చని ప్రచారం సాగుతోంది. ఇందుకు బిజెపి తెరవేనక మంత్రాంగం నడపనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది కేరళ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. పార్టీకి సాంప్రదాయకంగా లభించే ఓట్లు మాత్రమే కాకుండా, కాంగ్రెస్ వ్యతిరేక ఓటర్లను సైతం ఆకర్షించగల సత్తా శశిథరూర్‌కు ఉంది. కేరళలో సొంతంగా ఇమేజ్ గల ఏకైక కాంగ్రెస్ నేత ఆయనే అని చెప్పవచ్చు. నాలుగు దశాబ్దాల కేరళ చరిత్రలో తొలిసారి అధికార పార్టీ గెలుపొందిన ఘనతతో పదేళ్ళపాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న సిపిఎం నేత పి విజయన్‌కు వచ్చే ఏడాది ఎన్నికలు ప్రతికూలంగా ఉండే అవకాశం ఉన్నట్లు పలువురు భావిస్తున్నారు. ఇప్పటికే పినరయ్ పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. అటువంటి సమయంలో శశిథరూర్ పార్టీపై తిరుగుబాటు చేసి, బయటకు వస్తే అధికారంలోకి వస్తామని ఎదురు చూస్తున్న కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. తనకు వేరే ఆప్షన్లు ఉన్నాయని శశిథరూర్ చెప్పడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని చెబుతున్నారు. ఆయనకు ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో, విద్యావంతులలో మంచి ఆదరణ లభించే అవకాశం ఉంది. వామపక్ష కూటమి సైతం ఆయనతో పొత్తుకు సిద్ధం కావచ్చు. ఏదిఏమైనా ఈ విషయంలో శశి థరూర్ ఆలోచనలు, ప్రాధాన్యతలు వెల్లడి కావాల్సి ఉంది. ఆయన తిరుగుబాటు జరిపితే కేరళలో కాంగ్రెస్ కూటమికి కోలుకోలేని దెబ్బతీసే అవకాశం ఉంది. మరో వంక తొలిసారి గత ఏడాది కేరళలో ఒక లోక్‌సభ స్థానం గెల్చుకున్న బిజెపి ప్రజాదరణ గల నాయకుడి కోసం అన్వేషిస్తున్నది. శశిథరూర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే ప్రధాని మోడీకి సన్నిహితులైన కొందరు కలిసి, ఈ విషయమై చర్చలు జరిపారని తెలుస్తున్నది. మరో వంక హోం మంత్రి అమిత్ షా సైతం ఆయనతో సంప్రదింపులతో ఉన్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో శశిథరూర్‌ను ఓ ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేయమని కూడా కొందరు ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం 'ఇండియా' కూటమిలో ఉన్న ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌ను నెట్టివేసి ప్రయత్నంలో ఉన్నందున ఆయనను కలుపుకొని అవకాశం ఉంది. శశిథరూర్ ప్రభావం కేవలం కేరళకు మాత్రమే పరిమితం కాకపోవచ్చు. మొత్తం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని సవాల్ చేసే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ఇకపోతే తాజా రాజకీయ దుమారంలో శశిథరూర్ స్పందించారు. తాజాగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రశంసించడమే కాక.. కేంద్ర మంత్రి పియూష్ గోయెల్‌తో ఆయన సెల్ఫీ దిగి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపిలో చేరుతారనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై శశిథరూర్ స్పష్టత ఇచ్చారు. తాను కాంగ్రెస్ పార్టీని వీడే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీకి తన అవసరం ఉన్నంత వరకూ అందులో కొనసాగుతానని, అవసరం లేని సమయంలో తనకు వేరే ప్రత్యామ్నాయాలు ఉన్నాయి, కానీ, వేరే పార్టీలో చేరే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీలో తనను కొంతమంది వ్యతిరేకిస్తున్నారని.. కానీ తనకు దేశం, కేరళ భవిష్యత్తు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. తాను ఎప్పటికి కాంగ్రెస్‌కు విధేయుడినని అన్నారు. తాను ఐక్యరాజ్యసమితిలో దౌత్యవేత్తగా ఉన్నప్పుడు సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అవసరమైతే కాంగ్రెస్ పార్టీలో పెద్ద పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

# బీఆర్ఎస్‌కు ఏమైంది! ఎమ్మెల్సీ 'ఎన్నికల'కు ఎందుకు దూరం?

హైదరాబాద్,రజతోత్సవ సంబరాలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీ బీఆరెఎస్ .. పద్నాలుగేండ్ల సుదీర్ఘకాలం పోరాటం చేసిన ఉద్యమపార్టీ టీఆరెఎస్ . .పదేండ్లు అధికారం చెలాయించిన పార్టీ.. అదే ఊపులో ప్రాంతీయ పార్టీగా తెలంగాణ అస్థిత్వ పార్టీగా పురుడు పోసుకుని పెరిగి పెద్దై ప్రత్యేక రాష్ట్ర కలనూ.. అధికారాన్ని కైవసం చేసుకుని అప్రతిహతంగా 'అభివృద్ధి' సాగించిన పార్టీ. ప్రాంతీయం నుంచి దేశ రాజకీయాల్లో 'ఛక్రం' తిప్పేందుకు అంటిపెట్టుకున్న బంధాన్ని, అప్పటి వరకు ఉన్న సెంటిమెంటును 'తెగదెంపులు' చేసుకుని తెలంగాణ రాష్ట్ర సమితి ( టీఆరెస్) నుంచి భారత రాష్ట్ర సమితి (బీఆరెస్)గా రూపాంతరం చెందింది. పక్క రాష్ట్రంలో పాదులు వేసేందుకు అధికారంలో ఉన్నప్పుడే పావులు కదిపింది.మూడవసారి ముచ్చటగా తమదే అధికారమని కలలుగన్న స్థితి నుంచి అధికారం కోల్పోయి రాష్ట్రంలో ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కొనసాగుతున్న పార్టీ.. ఎవరికెన్ని భిన్నాభిప్రాయాలున్నప్పటికీ రాష్ట్రంలో ప్రధానమైన రాజకీయ పార్టీగా కొనసాగుతున్న పార్టీ బీఆరెస్. ఎన్నికలనూ.. పోరాటాన్ని కలగలపి జమిలి ఉద్యమాన్ని కొనసాగించిన అనుభవం ఆ పార్టీకి స్వంతం. ఎన్నికలే ఎజెండాగా గులాబీ జెండాలెత్తి ఉప ఎన్నికల్లో మునిగితేలి ఉద్యమాన్నికొనసాగించిన పార్టీగా ప్రత్యేక గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. పార్టీ అధినేత కేసీఆర్ కు ఎన్నికల వ్యూహాల్లో ఆరితేరిన వ్యక్తిగా ఆయనకు ఎక్కడలేని కీర్తి పతకాలూ.. కితాబులిచ్చిన విషయం మన కళ్ళ ముందటి విషయమే కావడం గమనార్హం. అలాంటి పార్టీ ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికలంటేనే వణికిపోయే పరిస్థితికి వచ్చింది. ఎన్నికల్లో పోటీకి వెనుకంజ వేస్తోంది. ఈ వ్యవహారంలో సైతం స్పష్టమైన ప్రకటన చేయకుండా దొడ్డిదారి విధానాలను అనుసరిస్తుందనే విమర్శలను మూటగట్టుకుంటుందీ. రాజకీయ క్షేత్రంలో 'విశ్వనీయత'ను తగ్గించుకుంటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోందీ.

నేతలకు.. గడ్డుకాలం

బీఆరెస్ పార్టీ వ్యవస్థాపక అధ్య-క్షుడిగా ఎన్నికల వ్యూహంలో ఆరితేరిన వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపునూ , కీర్తి కిరిటాలను అందుకున్న నేతగా గుర్తింపు పొందిన కేసీఆర్, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. ఉప ఎన్నికల విజయాల్లో ఛక్రం తిప్పిన నేతలుగా పేరొందిన ఆపార్టీ నాయకులు హరీష్ రావు కేటీఆర్ ఇప్పుడు విషమ పరిస్థితిని అనుభవిస్తున్నారు. ఒక్క ఓటమికే ఈ పార్టీ చతికిల పడిందా? అధికారం కోల్పోతే అంతే సంగతులా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పార్టీని, జాగృతిని ఏకకాలంలో రెండు భుజాలపై మోస్తున్న కేసీఆర్ కుమార్తె కవిత కూ ఈ పరిస్థితి నుంచి మినహాయింపేమీలేదు. పైకి ఎంత మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా రాజకీయ క్షేత్రంలో బీఆరెస్ ఇప్పుడు సవాళ్ళను ఎదుర్కొంటుందనడంలో సందేహంలేదు. ఈ జాబితాలో నిత్యం అధికార కాంగ్రెస్ పై విమర్శనాస్త్రాలు, దాడిని ఎక్కుపెడుతున్న ఆ పార్టీ ద్వితీయ శ్రేణి 'ముఖ్య' నేతలకు తప్పడం లేదు. కళ్ళముందున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఎజెండాను కాదని దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారనే విమర్శ సాగుతోంది.

అసలు బీఆరెస్ నేతలకు ఏమైంది?

25 సంవత్సరాలలో తమదైన 'చరిత్ర'నూ.. అనుభవాన్నీ.. ఆటుపోట్లనూ పోగేసుకున్న భారత రాష్ట్ర సమితికీ, ఆ పార్టీ ముఖ్యనేతలకు అసలిప్పుడేమైందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల్లో అరితేరిన పార్టీకీ, నేతలకు ఇప్పుడు ఎన్నికలంటేనే ఎందుకు వణుకొస్తున్నది. రాజకీయ రంగంలో రోజువారీగా ఎదురవుతున్న ఈ ప్రశ్నలు తొక్కిపట్టి, రాజకీయ విమర్శలనూ, సవాళ్ళను క్షేత్రంలో ఉన్న కేటీఆర్, హరీష్ రావు, కవిత సమాధానం చెప్పకుండా వ్యవహరిస్తుండగా.. మిగిలిన నేతలు ముఖం చాటేస్తున్నారు. ఇక పార్టీ నేత, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ పద్నాలుగు నెలలుగా కేవలం ఫాం హౌజ్ కే పరిమితం కావడం రాజకీయ చతురతగా అభివర్ణించుకోవడం ఆ పార్టీకి చెల్లుబాటు కావచ్చేమోగానీ? నిజమైన రాజకీయ విధానం మాత్రం కాదనే విమర్శలు ఇప్పటికీ వ్యక్తమవుతున్నాయి. చదువుకున్న వారు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా బీఆరెస్ ఉండడంలో ఏదో రాజకీయ ప్రయోజనం ఉందనే అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఎవరి ప్రయోజనం కోసం ఈ దూరం పాటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నీ.. ప్రత్యేక సందర్భాలుండవు!

నిజమే రాజకీయాల్లో అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉండకపోవచ్చు.ప్రత్యేక సందర్భాల్లో ఎన్నికల్లో పోటికీ దూరంగా ఉండాల్సి రావచ్చు.. దీనికి అనేక కారణాలుంటాయి.. పోటీకి ఆ పార్టీకి శక్తి లేకపోవడం, అభ్యర్థులు లేక పోవడం, తాము పోటీ చేయడం వల్ల తమ ప్రత్యర్థికి లాభం జరిగే సందర్భాలుంటాయి. ఇందులో చివరి అంశం తప్ప ప్రస్తుతం రాష్ట్రంలో బీఆరెస్ కు మిగిలిన అవకాశాలున్నాయి. ఇక ఎన్నికలన్న తర్వాత గెలుపోటములుంటాయి. ప్రతీ పార్టీ, వ్యక్తి గెలుపే లక్ష్యంగా పోటీలో ఉంటారు. ఇక ఎన్నికల గీటురాయిగా




భావించే పార్టీలో ఎన్నికల్లో ఏ ఫలితాలొచ్చినా.. ఓటమి తప్పదనీ తెలిసి కూడా పోటీ చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోందీ. కానీ, దీనికి భిన్నంగా బీఆరెస్ వ్యవహరిస్తుందనే విమర్శలున్నాయి.

ద్వంద వైఖరి ఎంత కాలం?

బీఆరెస్ నాయకులు తాజాగా ఎన్నికల అంశంలో ద్వంద వైఖరి అనుసరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ సాకుతో ఎంత కాలం వెల్లదీస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఒక వైపు తమ ముందుకు వచ్చిన కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలకు సంబంధించి మూడు స్థానాల్లో పోటీకి దూరంగా ఉంటున్నారు. పార్టీకి బలమైన ప్రాంతాలు, ఆ పార్టీ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవితలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో సైతం ఎందుకు పోటీ చేయడంలేదో 'స్పష్టమైన' ప్రకటన చేయడంలో దోబూచులాడుతున్నారు. దీంతో ఆ పార్టీ నాయకుడు, వరంగల్ కు చెందిన మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్, కరీంనగర్ కు చెందిన మాజీ మేయర్ సింగ్ లు స్వతంత్రులుగా బరిలో నిలిచారు. పార్టీ మాత్రం మౌన ముద్ర వహిస్తున్నది. ఇదిలా ఉండగా మరో వైపు బీఆరెస్ నుంచి కాంగ్రెస్ లోకి ఫిరాయించిన ఎమ్మెల్యే స్థానాల్లో ఉప ఎన్నికలొస్తాయని, అక్కడ పోటీకి సిద్ధమంటూ సవాల్ విసురుతున్నారు.. పైగా సీఎం రేవంత్ కొడంగల్లో రేవంత్ రాజీనామా చేసి ఉప ఎన్నికకు సిద్ధం కావాలని, ఇక్కడ తమ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని సవాళ్ళు విసురుతున్నారు. ఇంకో వైపు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమంటూ ప్రకటిస్తున్నారు. మరి తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక వహించిన నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎందుకు దూరంగా ఉంటున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. నిజమే పార్లమెంటు ఎన్నికల్లో ఆపార్టీకి ఒక్క స్థానం కూడా దక్కలేదు. దీనిపై ఆరోపణలున్నాయి. తర్వాత నల్లగొండ, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైంది. బీజేపీ నుంచి బీఆరెస్ లో చేరిన వ్యక్తికి అవకాశం కల్పించారనే విమర్శలున్నాయి. గెలిచే అవకాశాలుంటనే పోటీచేస్తారా? ఉద్యమ సమయంలో కూడా పోటీచేసిన పార్టీకి ఇప్పుడు అన్ని హంగులున్నా ఎందుకు వెనుకంజ వేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

కాంగ్రెస్, బీజేపీ, బీఆరెస్ పరస్పర విమర్శలు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆరెస్ లు పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకుంటున్నాయి. బీఆరెస్ తాజా ఎన్నికలకు దూరంగా ఉండటం ఎవరి ప్రయోజనాల కోసమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ విజయానికి సహకరించేందుకే బీఆరెస్ ఈ విధంగా వ్యవహరిస్తుందనే విమర్శలు కాంగ్రెస్ చేస్తుండగా కాంగ్రెస్ కోసమే పోటీకి దూరంగా ఉంటున్నారనేది బీజేపీ ఆరోపణ. ఆరోపణలు ఎలా ఉన్నా? రాష్ట్రం బీఆరెస్, కాంగ్రెస్ మధ్య సయోధ్య అనేది ప్రశ్నార్థకమైనా అంశమే.. ఇక బీఆరెస్, బీజేపీ మధ్య ఏదో ఉందనే విమర్శలు పార్లమెంటు ఎన్నికల నుంచి తలెత్తుతున్నాయి. దీనికి సమాధానం చెప్పాల్సిన బీఆరెస్ రాజకీయ విమర్శలు చేస్తూనే పోటీలో లేక పోవడం అనుమానాలకు తావిస్తోందీ.

రాజకీయ విశ్వసనీయతకు సమస్య

తాజా రాజకీయాల్లో విలువలూ.. విషయాలపై అంతగా చర్చ జరుగని అంశం వాస్తమే అయినప్పటికీ ఇలాగే రాజకీయాలు కొనసాగితే రానున్న రోజుల్లో రాజకీయ పక్షాల ఉనికి, నేతల విశ్వనీయత, అంకితభావం ప్రశ్నార్ధకంగా మారుతోంది. అన్ని రాజకీయ పక్షాలు, నాయకులు వీటిని కాపాడేందుకూ.. కనీస విలువలను నిలబెట్టేందుకు ప్రయత్నించకపోతే రానున్న రోజుల్లో 'రాజకీయం' మరింతగా మార్కెట్ సరుకుగా మారేందుకు ఎక్కువ కాలం పట్టకపోవచ్చు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని పార్టీలూ.. నేతలు గుర్తెంచాల్సి ఉంది. ప్రజలూ, ప్రజాస్వామిక వాదులు అప్రమత్తంగావాల్సిన అవసరం ఉంది.

# ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు

హైదరాబాద్,తెలంగాణలో ఉపాధి కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేసింది ప్రభుత్వం. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నిధులు జమ అయ్యాయి. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో ప్రభుత్వం నిధులను జమ చేసింది. మొత్తం 18,180 మందికి 6 వేల చొప్పున జమ అయ్యాయి. అయితే ఆ తర్వాత మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇంది రమ్మ ఆత్మీయ భరోసా నిలిచిపోయింది. కానీ.. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. మంత్రి వినతిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ రెండు జిల్లాల్లో 66,240 మంది ఉపాధి కూలీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించింది సర్కార్. 66,640 మంది కూలీల ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ అయ్యాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు రూ.50.65 కోట్లను తెలంగాణ ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల కోడ్ ముగియగానే లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించనుంది సర్కార్. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఉపాధి కూలీలకు పెద్దదిక్కుగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఉపాధి కూలీలకు ఆర్థిక చేయుత కల్పిస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఒక సీజన్‌కు 6000 రూపాయలు చొప్పున కూలీలకు భరోసా కల్పిస్తోంది. డీబీటీ పద్ధతిలో ఉపాధి కూలీల ఖాతాల్లోకి నేరుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తోంది.

# మళ్లీ కేసీఆర్ చెంతకు

హైదరాబాద్,బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే ఆ ఎమ్మెల్యే కారు దిగేశాడు.. పవర్‌లో ఉన్నంత కాలం ఎంచక్కా కూడబెట్టుకున్న అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికి హస్తం గూటికి చేరిపోయాడు. మరి కాంగ్రెస్‌లో ఏం లెక్కలు తేడా వచ్చాయో కాని తిరిగి గులాబీ గూటికి చేరడానికి రెడీ అయ్యాడంట. ఆ దిశగా గులాబీబాస్‌తో మంతనాలు కూడా సాగిస్తున్నాడంట. ఇంతకీ ఎవరా శాసనసభ్యుడు? అంత చకచకా రాజకీయ రంగులు మార్చేస్తూ యూటర్న్ తీసుకోవడం వెనుక లెక్కలేంటి?పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హస్తం కూటికి చేరి పట్టుమని పది నెలలు కూడా కాలేదు. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన గూడెం మహిపాల్ రెడ్డి గుండెల నిండా గులాబీ జెండానే ఉందంట. అందుకే మళ్లీ తన సొంత గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నాంట. మళ్లీ తన సొంత కారులో ఎక్కేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సంప్రదింపులు మొదలుపెట్టారంట. కారు ఓనర్ ఓకే అంటే ఏ క్షణమైనా జంప్ చేయడానికి సిద్ధంగా ఉన్నారంట. అంతా సజావుగా జరిగితే మార్చి 2 న గులాబీ కండువా కప్పుకోవడం ఖాయమంటున్నారు గూడెం అనుచరులు.గూడెం మహిపాల్ రెడ్డి మూడు సార్లు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మూడో సారి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ 2024 లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం గూడెంకు షాక్ తగిలిందనే చెప్పవచ్చు. ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ హయాంలో చేసిన అవినీతి, అక్రమాలతో పాటు అనుమతికి మించి క్రషర్ తవ్వకాలు చేశారని ఆయనపై ఆరోపణలున్నాయి. తన అక్రమ దందాలతో కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వెలుగులోకి తీసింది. దాంతో కేసుల భయంతో ఆయన 2024 జూలైలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.మొదట్లో కాస్త బాగానే ఉన్నా గత కొద్ది రోజులుగా పటాన్ చెరు ఎమ్మెల్యే అధికార పార్టీలో ఇమడలేక పోతున్నారంట. నియోజకవర్గంలో ఏదైనా అధికార కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే మంత్రుల పర్యటనపై ఎమ్మెల్యేకు సమాచారం ఉండటం లేదంట. వారంతట వారు వచ్చి ప్రోగ్రామ్స్ చేసుకుని వెళ్లిపోతుండటం గూడెంకు మింగుడుపడటం లేదంట. కనీసం ఎమ్మెల్యే పేరు ఎక్కడా ప్రస్తావించకుండానే కార్యక్రమాలను ముగిస్తుండటం ఆయనకు పుండు మీద కారం చల్లినట్లు అవుతోందంట.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన కుల గణన, ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యేకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు మెదక్ కంటెస్టెడ్ ఎంపీ క్యాండెట్ నీలం మధు స్వగ్రామమైన చిట్కుల్ లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా హాజరయ్యారు. అయితే సమాచారం లేకపోవడంతో ఎమ్మెల్యే గైర్హాజరవ్వడం చర్చనీయాంశంగా మారింది.ఇక మహిపాల్‌రెడ్డి పార్టీ మారాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ ఫోటో పెట్టలేదని కాట శ్రీనివాస్ గౌడ్ వర్గీయులు గతంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ విషయం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అదలా ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలోనూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కనిపించలేదు. దాంతో ఆయన ఎక్కడా అంటూ కాంగ్రెస్ నేతలు రసాభస చేశారు. ఇవన్నీ జీర్ణించుకోలేని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ గులాబీ కండువా కప్పుకుని తిరిగి సొంత గూటిలోకి వెళ్లాలని నిశ్చయించుకున్నారంట. మార్చి నెల 2 వ తేదీన కారు ఎక్కేందుకు ముహూర్తం ఖరారైనట్లు చెప్తున్నారు. హరీష్ రావుకు వీర విధేయునిగా పేరు ఉన్న మహిపాల్ రెడ్డి మళ్లీ బీఆర్ఎస్ లోకి చేరడం తథ్యమేనని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. గూడెం మహిపాల్ రెడ్డీ కాంగ్రెస్‌లో చేరిన నాటి నుండి పటాన్‌చెరులో కాటా శ్రీనివాస్ వర్గం వ్యతిరేకంగా ఉంది. నియోజకవర్గంలో కాటా, గూడెం వర్గాల మధ్య అగాధం పెరిగింది. అధిష్టానం ఇద్దరు కలిసి ఉండాలని చెప్పినా ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆ క్రమంలో గూడెం మళ్ళీ యు టర్న్ తీసుకున్నారని.. అందుకు కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని.. మహిపాల్‌రెడ్డి మళ్లీ కారులో షికారు చేయడం ఖాయమైం దంటున్నారు.

# అందరికీ ఓకేనా ?

హైదరాబాద్,జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చే స్టేట్మెంట్స్ లో రాజకీయ పాళ్ళు తక్కువగా ఉంటాయి. ఆయన తన మనసులో ఏముందో అదే చెబుతారు. అలా ఆయన చెప్పేటపుడు ఏ రాజకీయ గణితాన్ని పట్టించుకోరు. లెక్కలు కూడా వేసుకోరు అని అంటారు.లేటెస్ట్ గా అసెంబ్లీలో పవన్ ఇచ్చిన ఒక సంచలన స్టేట్మెంట్ ని అలాగే చూడాలని అంటున్నారు. ఇంతకీ పవన్ ఇచ్చిన స్టేట్మెంట్ సంగతేంటి అంటే ఏపీలో పదిహేనేళ్ళ పాటు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉండాలని. అంటే 2039 వరకూ ఇదే కూటమి పాలన సాగాలన్నది పవన్ గట్టి సంకల్పంతో ఇచ్చిన స్టేట్మెంట్ అన్న మాట.సరిగ్గా కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఇదే పవన్ పదేళ్ళ పాటు చంద్రబాబే సీఎం అని ఒక భారీ ప్రకటన చేశారు. ఇపుడు మరో అయిదేళ్ళు ఆయన పెంచారు. పవన్ ఈ విధంగా చెప్పడానికి కారణం ఏపీ అభివృద్ధి కోణమే తప్ప రాజకీయం ఇందులో లేదని అంటున్నారు. ఒకే పార్టీ కానీ కూటమి ప్రభుత్వం కానీ నిరంతరంగా కొనసాగితేనే తప్ప ఏపీ అభివృద్ధి సాధించదు అన్న ఆలోచనతో ఆయన ఈ విధంగా చెబుతున్నారు అని భావించాలి. ప్రతీ అయిదేళ్ళూ ప్రభుత్వాలు మారితే ఆయా పార్టీల ప్రాధాన్యతలు మారి పరిస్థితి ఎపుడూ మొదటికే వస్తుందన్న ఆలోచనతో ఆయన చెప్పారని అనుకోవాలి.అయితే ఆయన కిందా పద్దా మీద పద్దా మాది అంతా ఒకే కుటుంబం. అంతా కలసే ఉంటాం, మేము అలా ఐక్యంగానే ముందుకు వెళ్తామని ఇచ్చిన ఈ ప్రకటనతో జనసేన టీడీపీ బీజేపీ దిగువ స్థాయి వర్గాలు శ్రేణులు కూడా అర్ధం చేసుకుని ముందుకు సాగాలన్న సంకేతం ఉంది. అదే విధంగా ఏపీలో ఎన్డీయే కూటమి తప్ప మరోసారి వైసీపీ రానే రాదు అన్న హెచ్చరిక ఉంది.అంతే కాకుండా రాజకీయాల కోసం కాకుండా పవన్ ఏపీ భవిష్యత్తు కోసమే ఈ ప్రకటన చేశారన్న సూచన కూడా ఉంది. ఇదిలా ఉంటే పదిహేనేళ్ల పాటు ఎన్డీయే ప్రభుత్వం అంటే అందులో సీఎం గా ఎవరు ఉంటారు అన్నది మాత్రం పవన్ చెప్పలేదు. ఒక విధంగా అదిప్పుడు అప్రస్తుతం కూడా. ఆ అవసరమే లేదు కూడా. గతసారి పదేళ్ళ పాటు బాబు సీఎం అని పవన్ అన్నారు. అపుడు కొంత అసంతృప్తి అయితే ఆయన సామాజిక వర్గం నుంచి పార్టీ క్యాడర్ నుంచి వచ్చిందని ప్రచారం సాగింది.దాంతో ఈసారి పవన్ సీఎం ఎవరు అన్నది చెప్పకుండా ఎన్డీయే ప్రభుత్వం అని మాత్రమే అంటున్నారు. అంటే ఎవరు నాయకత్వం వహించినా మూడు పార్టీల ప్రభుత్వం ఏపీలో ఉంటుంది అన్నది అంతరార్థంగా ఉందని అంటున్నారు. ఇక పదేళ్ళ పాటు బాబు సీఎం గా ఉండాలని పాత ప్రకటనకు కొనసాగింపుగానే ఈ ప్రకటన ఇచ్చి ఉంటారని అంటున్నారు. అంటే పదేళ్ళ పాటు బాబు సీఎం గా ఉన్నా ఆ మిగిలిన అయిదేళ్ళలో పవన్ కి చాన్స్ ఉంటుందని కూడా అనుకోవచ్చు అని అంటున్నారు.లేదా ఎన్డీయే ప్రభుత్వం అన్నారు కాబట్టి ఒక టెర్మ్ టీడీపీకి సీఎం పదవి వెళ్ళినా మరో టెర్మ్ జనసేన తీసుకోవడానికి కూడా చాన్స్ ఉంటుందని ఒక బలమైన సామాజిక వర్గంలో ఆశలు అలాగే సజీవంగా ఉంచారని అంటున్నారు. అంతే కాదు పార్టీ క్యాడర్ కి ఇది అంతర్లీనంగా సందేశంగా ఉందని అంటున్నారు.అయితే ఈ ప్రకటనలో ఎవరికి వారు ఏ అర్థం తీసుకున్నా ఇబ్బంది లేనట్లుగానే ఉంది. కానీ కూటములు కట్టేటపుడు పెద్దన్న పార్టీలలో ఉండే పార్టీలకే నాయకత్వాలు సహజంగా వెళ్తాయి. అందువల్ల జనసేన అధినేత ఇచ్చిన ఈ ప్రకటనతో జనసేన కూడా బలమైన పార్టీగా ఫ్యూచర్ లో కూటమిలో కీలక పాత్ర పోషించవచ్చు అన్నది కూడా ఉందని చెబుతున్నారు.

# మళ్లీ కూలే ప్రమాదం! ర్యాట్ హోల్ మైనర్స్‌కు ఛాలెంజ్!




హైదరాబాద్, టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ కంటిన్యూ అవుతోంది. టన్నెల్లో చిక్కుకున్న 8 మంది కార్మికుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. అనేక రకాలుగా టన్నెల్ లోపలికెళ్లి గాలించినా కార్మికుల ఆచూకి లభించడం లేదు. నిన్న రాత్రి ఘటనాస్థలానికి 15 మీటర్ల వరకు సహాయక బృందాలు చేరుకున్నాయి. అక్కడంతా బురద, మట్టి పెల్లలతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. NDRF, SDRF, నేవీ, ఆర్మీ, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్ సహా పలు టీమ్‌లు ఘటనా స్థలానికి దరిదాపుల్లోకి వెళ్లారు. కానీ, అక్కడ ఆక్సిజన్ ?అందకపోవడంతో హుటాహుటిన వెనక్కి వచ్చేశారు. ఇవాళ ఆక్సిజన్ ?సాయంతో ఘటనా స్థలానికి మరింత చేరువగా వెళ్లే అవకాశముందని తెలుస్తోంది.మరోవైపు టన్నెల్?కు అడ్డుగా పేరుకుపోయిన టీబీఎం శిథిలాలను తొలగించేందుకు ఎల్అండ్ టీ, నవయుగ, మేఘా కంపెనీ ఎక్స్?పర్ట్స్? శ్రమిస్తున్నారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు వీరంతా టన్నెల్?లోకి వెల్డింగ్ మెషీన్లు, కట్టర్లను తీసుకెళ్లి ఒక్కొక్కటే కట్ చేస్తున్నారు. మరికాసేపట్లో కన్వేయర్? బెల్టును పునరుద్ధరించి డెబ్రిస్?ను బయటకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు సెగ్మెంట్? బ్లాక్స్ ?నుంచి ధారాపాతంగా వస్తున్న సీపేజ్, కూలుతున్న మట్టి పెల్లలతో టన్నెల్?లో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇలాంటి టైంలో రెస్క్యూ ఆపరేషన్ ?చాలా డేంజర్ అని స్వయంగా? ఎన్జీఆర్ఐ నిపుణులు హెచ్చరించడం తో సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తతో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. కాగా.. 11.5 కి.మీ నుంచి ఎయిర్ సప్లయ్ పైప్‌లైన్ వ్యవస్థ ధ్వంసమైంది. మరో వైపు జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ ఎక్స్‌పర్ట్స్ బురద పరిస్థితిపై అంచనా వేస్తున్నారు. 200 మీటర్ల వరకు 15 అడుగుల ఎత్తులో బురద పేరుకుపోయింది. సొరంగంలో ప్రస్తుతం గంటకు 3600 నుంచి 5000 లీటర్ల ఊట వస్తోంది. సొరంగ మార్గంలో 10వేల క్యూబిక్ మీటర్ల బురద ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. బురదను బయటకు తీయడమే పెద్ద టాస్క్ అని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ప్రస్తుతం కన్వేయర్ బెల్ట్‌కు రిపేర్లు చేస్తున్నారు. ఇవాళ సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ రిపేర్ పూర్తయ్యే ఛాన్స్ ఉంది. కన్వేయర్ బెల్ట్‌తో గంటకు 800 టన్నుల బురద బయటకు తోడే అవకాశముందని చెబుతున్నారు.టీబీఎం మెషిన్ దాటిన తర్వాత 100 మీటర్ల మేర బురద పేరుకుపోయింది. అక్కడి వరకు వెదురు బొంగులు, థర్మకోల్ షీట్స్‌తో చేసిన ఫిషింగ్ బోట్లతో రెస్క్యూ టీమ్స్ వెళ్లగలుగుతున్నాయి. ఆ తర్వాత దట్టమైన బురద సుమారు ఆరేడు అడుగుల ఎత్తులో పేరుకుపోయి ఉంది. ఆ అడ్డంకి దాటితేనే ప్రమాదానికి గురైన TBM ముందు భాగం, అందులో చిక్కుకుపోయిన 8 మందిని గుర్తించే అవకాశముంటుంది. అయితే ఆ ప్రాంతానికి సహాయక బృందాలు వెళ్లలేకపోతున్నాయి. పుషింగ్ కెమెరాలు, డ్రోన్లు, సిగ్నలింగ్ వ్యవస్థ.. ఎన్ని ఏర్పాట్లు చేసినా ఫలితాలు రావడం లేదు.ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకునేందుకు సొరంగంపై నుంచి కాని, పక్క నుంచి కానీ.. వెళ్లే మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహాయక బృందాలతో రెండు సార్లు సమీక్షలు నిర్వహించారు. ఇండియన్ నేవీ, ఎన్డీఆర్ఎఫ్ కలిసి ప్రయోగాత్మకంగా మరోసారి సొరంగంలోకి వెళ్లి, ఇవాళ టార్గెట్ ఏరియాకి వెళ్లేందుకు ప్రయత్నిస్తారన్నారు. 8మంది ప్రాణాలను కాపాడటమే మొదటి ప్రాధాన్యంగా చర్యలు చేపడతున్నట్లు ఉత్తమ్ వివరించారు.

# వేయిస్తంభాల గుడిలో ప్రత్యేక పూజలు

వరంగల్, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ఆలయాలకు శివరాత్రి శోభ సంతరించుకుంది. శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. కొన్ని ఆలయాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సౌకర్యాలు చేశారు. హనుమకొండలోని వేయిస్తంభాలగుడి, కాజీపేట మడికొండలోని మెట్టుగుట్ట, వరంగల్లోని భద్రకాళి ఆలయం, కాశీబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయం భక్తులతో రద్దీగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామప్పలోని రామలింగేశ్వర క్షేత్రం, మహబూబాబాద్ జిల్లా కురవి వీరభద్రుడి సన్నిధి, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమ తీరం, కాళేశ్వర ముక్తీశ్వర సన్నిధానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగుతున్నాయి.

# దేశంలో ప్రమాద ఘంటికలు... బంగ్లా, పాక్ తర్వాత భారత్!



హైదరాబాద్,ఇటీవల కాలంలో.. దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిన సంగతి తెలిసిందే. గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో ఢిల్లీలో గాలి పీలిస్తే... ఒక్క రోజులో 40 కంటే ఎక్కువ సిగరెట్లు కాల్చడంతో సమానం అనే కామెంట్లు వినిపించాయి. ఈ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా కాలుష్య దేశాల జాబితా తెరపైకి వచ్చింది.అవును... ఇటీవల ప్రాణాంతమైన పొగమంచు ఢిల్లీలోని ప్రతీ పౌరుడి ఊపిరితుత్తులకు హాని కలిగిస్తున్నాయనే కామెంట్లు వినిపించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. ప్రపంచవ్యాప్తంగా అత్యంత కాలుష్య దేశాల జాబితాలో భారత్ మూడో స్థానాన్ని ఆక్రమించిందని తాజా నివేదికల్లో వెల్లడైంది! ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఏక్యూఐ.ఇన్ ప్రకటించిన తాజా నివేదికలో.. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత కాలుష్య దేశాల జాబితాలో భారత్ మూడో స్థానాన్ని ఆక్రమించింది. ఈ జాబితాలో 140 ఏక్యూఐ తో బంగ్లాదేశ్ అత్యంత కాలుష్యం కలిగిన దేశంగా ఫస్ట్ ప్లేస్ లో ఉండగా.. 115 ఏక్యూఐతో పాకిస్థాన్ రెండో స్థానంలో నిలిచింది. ఇక 111 ఏక్యూఐతో భారత్ మూడోస్థానంలో నిలిచింది.ఇదే సమయంలో... అత్యంత కలుషిత నగరాల జాబితాలో భారతదేశ రాజధాని న్యూఢిల్లీ టాప్ ప్లేస్ లో నిలిచింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఏక్యూఐ 169 గా ఉండగా.. తర్వాత వరుసగా... గ్రేటర్ నొయిడా (166 ఏక్యూఐ), నోయిడా (161), ఘజియాబాద్ (159), ఫరీదాబాద్ (154), గురుగ్రాం (153) నగరాలు అత్యంత కాలుష్యమైనవిగా గుర్తించబడ్డాయి.ఈ సందర్భంగా.. దేశ రాజధాని పరిసర ప్రాంతాల్లో నిరంతరం పెరుగుతున్న ఏక్యూఐకి కారణమయ్యే కారణాలను కూడా నివేదిక వెల్లడించింది. ఇందులో భాగంగా.. వాహనాల నుంచి వెలువడే పొగతో పాటు పరిశ్రమలు, నిర్మాణ కార్యకలాపాల నుంచి వచ్చే కాలుష్యం వాటిలో ప్రధానమైనవని తెలిపింది.ఇదే సమయంలో దేశంలో పరిశుభ్రమైన గాలి నాణ్యతను కలిగి ఉన్న నగరాల జాబితా కూడా తెరపైకి వచ్చింది. ఇందులో తిరునెల్వేలి (తమిళనాడు) 33 ఏక్యూఐతో ఫస్ట్ ప్లేస్ లో ఉండగా... తర్వాత స్థానాల్లో వరుసగా... నహర్లగున్ (అరుణాచల్ ప్రదేశ్) 43 ఏక్యూఐ, మడికెరి (కర్ణాటక) 44 ఏక్యూఐ, విజయపురి (కర్ణాటక) 47 ఏక్యూఐ, తంజావూరు (తమిళనాడు) 47 ఏక్యూఐతో ఉన్నాయి.

# కన్నడ రాజకీయంలో ట్విస్ట్.. కుమారస్వామికి ఝలక్!



బెంగళూర్ :కర్ణాటకలో రాజకీయం మరోసారి ఆసక్తికరంగా మారింది. జేడీఎస్ సీనియర్ నేత, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డీ. కుమారస్వామిని విచారించేందుకు అనుమతివ్వాలని రాష్ట్ర పోలీసు శాఖ గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌కు విజ్ఞప్తి చేసింది. దీంతో, కన్నడ రాజకీయం హీటెక్కింది. గతంలో బళ్లారి జిల్లాలో శ్రీ సాయి వెంకటేశ్వర మినరల్స్ మైనింగ్ కేసులో అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న కుమారస్వామి అక్రమాలకు పాల్పడినట్లు ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తోంది. దీనిపై ఇప్పటికే ఓ కేసు విచారణలో ఉన్నందున ఆయనను విచారించడానికి అనుమతి ఇవ్వాలని సిట్ బృందం రాజ్‌భవన్‌కు లేఖ రాసింది. అయితే చార్జ్‌షీట్ కన్నడలో ఉందని, ఆంగ్లంలోకి అనువదించి అందజేయాలని రాజ్‌భవన్ అధికారులు సూచించారు. దీంతో సుమారు 4,500 పేజీల చార్జ్‌షీట్‌ను ఇంగ్లీష్‌లోకి మార్చి సమర్పించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ అనుమతి ఇస్తే సిట్ అధికారుల ముందు కుమారస్వామి విచారణకు హాజరుకావలసి ఉంటుంది. ప్రస్తుతం కర్ణాటకలో కేంద్రమంత్రి కుమారస్వామి, కాంగ్రెస్ సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య ఆరోపణల పర్వం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల వ్యవహారంలో సీఎం సిద్ధరామయ్యపై ఆరోపణలు రావడం కన్నడ రాజకీయాలను కుదిపేసింది. ఈ కేసులో సిద్ధరామయ్యకు భారీ ఉపశమనం లభించింది. ఈ భూముల కేటాయింపులో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఆయనకు వ్యతిరేకంగా ఆధారాల్లేవని లోకాయుక్త పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో సీఎంతో పాటు ఆయన సతీమణి పార్వతి, తదితరులకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాల్లేవని తేల్చి చెప్పారు. ఈ అంశంపై తుది నివేదికను హైకోర్టుకు సమర్పించనున్నట్లు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు రాసిన లేఖలో పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో తొలి నలుగురు నిందితులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాల్లేకపోవడంతో నిరూపితం కాలేదని తెలిపారు.అక్రమాస్తుల కేసులో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు ఊరట లభించిన విషయం తెలిసిందే. 2013-2018 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డీకే శివ కుమార్ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన ఆదాయానికి మించిన ఆస్తుల్ని కూడబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ ఆరోపణల నేపథ్యంలో ఆయనపై సెప్టెంబరు 2020న సీబీఐ ఎఫ్ఐఆర్ ఫైల్ చేసింది. విచారణ ప్రారంభించింది. దర్యాప్తు కొనసాగుతుండగానే ఆ కేసు సీబీఐ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరిలో లోకాయుక్త పోలీసులకు బదిలీ అయ్యింది. ఈ కేసు విచారణలో భాగంగా డీకే శివకుమార్ గత వారం లోకాయుక్త పోలీసుల ముందు హాజరయ్యారు. విచారణ అనంతరం ఆయనకు ఊరట దక్కింది.

# ఆ పంతమే.. జగన్‌కు శాపం ..!



అమరావతి,పంతం-నీదా-నాదా.. అంటూ.. వైసీపీ అధినేత జగన్ వ్యవహరిస్తున్న తీరు.. ఆయనకు పార్టీకి కూడా నష్టం తెస్తోందని అంటున్నారు పరిశీలకులు. సహజంగా రాజకీయాల్లో ఉన్నవారికి ఉండాల్సింది.. వ్యూహం-ఆలోచన, ఎత్తులు-పై ఎత్తులు.. తద్వారానే పార్టీలు, నాయకులు కూడా పుంజుకుంటారు. కానీ, పంతానికి పోయిన పార్టీ కానీ, నాయకులు కానీ రాజకీయాల్లో నిలిచి గెలిచిన చరిత్ర లేదు. ఈ విషయం జగన్ కు తెలుసో.. తెలియదో కానీ.. ఆయన పంతానికి పోతున్నారన్న మాట అయితే.. వైసీపీలోనే ఎక్కువగా ఉంది.గతంలో కాంగ్రెస్‌తో పంతానికి పోయి పార్టీ పెట్టుకున్నారు. ఒకే ఒక్కసారి సక్సెస్ అయి అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత.. నుంచి అనుసరించిన పంతంతో కూడిన వైఖరి జగన్ కు మేలు చేయకపోగా.. కీడునే చేసింది. ప్రభుత్వంలో ఉన్నప్పుడు.. ఇసుక వ్యవహారం జోలికి పోవద్దన్న మాటలను ఆయన ఖాతరు చేయలేదు. దీంతో కీలకమైన మాస్ ఓటింగ్ దెబ్బతింది. ఇక, మద్యం జోలికి వెళ్లొద్దని.. ధరలు పెంచొద్దని చెప్పినా.. వినలేదు. పంతానికి పోయారు. ఇది కూడా ఓటమికి దారితీసేలా చేసింది.ఇవన్నీ ఒక ఎత్తయితే.. సొంత చెల్లి షర్మిల రోడ్డున పడి.. తనకు అన్యాయం చేశాడని అరుపులు, పెడబొబ్బలు పెట్టినప్పుడు కూడా.. తాడేపల్లి ప్యాలస్ వీడి బయటకు రాలేదు. ఈ పంతానికి కూడా మూల్యం చెల్లించుకున్నారు. ఇక, ఆ తర్వాత.. బీజేపీతో పొత్తు విషయంలోనూ మైనారిటీ ఓటు బ్యాంకుకు భయపడి చేతులుకాల్చుకున్నారు. ఇలా.. అధికారంలో ఉండగా చేసిన పంతం.. అన్నీ విధాలా నష్టం చేసింది. పోనీ.. ఇప్పుడు 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. పంతం వీడారా? అంటే అది కూడా లేదు.అసెంబ్లీని 11 మందితోనే వినియోగించుకుని.. ప్రజల సమస్యలను ప్రస్తావిస్తే.. ఆ మార్పు స్పష్టంగా కనిపించేది. ఇప్పుడు ప్రజల తరపున సభలో ప్రశ్నించే గళం లేకుండా పోయిందన్న గ్యాప్.. వైసీపీకి మరింత ఇబ్బందిగా మారింది.కేవలం ప్రతిపక్ష నేత అనే హోదా కోసం వెంపర్లాడుతూ.. పంతానికి పోతున్న తీరుతో పార్టీపై ప్రజల్లో ఉన్న చిన్నపాటి సానుభూతిని కూడా పోగొట్టుకునే పరిస్థితి వచ్చింది. సో.. పంతం అన్ని వేళలా మేలు చేయదన్న కీలక సూత్రాన్ని జగన్ గ్రహిస్తే.. మంచిందని పరిశీలకులుచెబుతున్నారు.

# నాగబాబు మంత్రి పదవికి లైన్ క్లియర్..!



అమరావతి,జనసేన ప్రధాన కార్యదర్శి, పీఏసీ సభ్యులు, మెగా బ్రదర్ నాగబాబు త్వరలోనే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారా? జనసైనికుల ఆశ నెరవేరబోతుందా? నాగబాబు మంత్రి పదవికి లైన్ క్లియర్ అయిందా? అంటే అవునన్న సమాధానమే వినిపిస్తోంది. గత ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అనకాపల్లి స్థానం నుంచి ఎంపీగా నాగబాబు పోటీ చేయాలని భావించారు. కానీ పొత్తులో భాగంగా ఆ సీటును నాగబాబు బీజేపీ కోసం త్యాగం చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల నడుమ నాగబాబును కేబినెట్‌లోకి తీసుకోబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించేశారు.అయితే ఇందుకు ఇప్పుడు రంగం సిద్ధం అయింది. ఎమ్మెల్సీగా ఎన్నికై ఆ తర్వాత మంత్రిగా మెగా బ్రదర్ ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం ఐదు స్థానాలు కూటమికే దక్కనున్నాయని బలంగా టాక్ నడుస్తోంది. దీంతో ఆయా ఎమ్మెల్సీ స్థానాలు ఎవరినీ వరిస్తాయా? అన్న చర్చ జరుగుతోంది.అయితే ఐదు స్థానాల్లో జనసేన నుంచి నాగబాబుకు కన్ఫామ్ అయినట్లు సమాచారం అందుతోంది. అలాగే బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ మాధవ్ కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారని ప్రచారం జరుగుతుండగా.. మిగిలిన మూడు సీట్లు టీడీపీకి దక్కనున్నాయి. ఈ మూడు స్థానాల కోసం టీడీపీ నుంచి బుద్దా వెంకన్న, బీద రవీంద్ర, మోపిదేవి వెంకటరమణ, వంగవీటి రాధా, మంతెన సత్యనారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు వంటి వారు పోటీ పడుతున్నారు. వీరిలో ఎవరికి ఛాన్స్ దక్కుందో చూడాల్సి ఉంది.ఇకపోతే మార్చిలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాగబాబు శాసనమండలికి ఎన్నికై చంద్రబాబు కేబినెట్‌లో చోటు దక్కించుకోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో పవన్ కూడా శాసన మండలికి ఎన్నికై ఆ తర్వాత తన సోదరుడు కేబినెట్‌లోకి వస్తారని తెలిపారు. ఇప్పుడు ఆయన చెప్పినట్లే జరగబోతోంది. అనకాపల్లి లోక్‌సభ స్థానం త్యాగం చేసిన నాగబాబుకు తగిన ప్రతిఫలం దక్కబోతోంది.

# కృష్ణా డెల్టాకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా



అమరావతి,కృష్ణా డెల్టా పరిధిలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో వేసవిలో నీటి కొరత రాకుండా జలవనరుల శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందని మంత్రి అచ్చన్నాయుడు అన్నారు. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా నీటిని ప్రణాళికా బద్ధంగా ఉపయోగిస్తామని అన్నారు. ఉన్ననీటిని సాగు,తాగు నీటి అవసరాలకు వాడుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలో సాగులో ఉన్న పంటలకు నీరిస్తూనే... తాగు అవసరాలకు అనుగుణంగా కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజీలో నిల్వ నీటిని సమర్థంగా ఉపయోగిస్తూనే.. వచ్చే ఖరీఫ్‌లో పంటల సాగుకు ప్రారంభంలో నీటి విడుదలకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్, రబీ సీజన్‌లో పుష్కలంగా సాగునీరు సరఫరా చేశారు. కృష్ణానదికి గతేడాది నీటిప్రవాహం ఉండటం, అవసర మైనప్పుడు గోదావరి నది నీటిని పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోసి ప్రకాశం బ్యారేజీకి తరలించి పంటలకు సాగునీరు అందించారు. సాగునీటి సమస్య లేకపోవడంతో పెట్టుబడి వ్యయమూ తగ్గింది. రబీలోనూ పంటలు పూర్తయ్యే వరకు నీటివిడుదల కొనసాగుతుండటంతో రైతులకు కలిసొచ్చింది. ప్రస్తుతం మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలు సాగులో ఉన్నాయి. కాలువల చివర, సముద్రతీర ప్రాంత ఆక్వా చెరువులకు కూడా ఈసారి నీటిసమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికలతో నీటి వనరుల సద్వినియోగంతో అన్నదాతల కష్టాలు తొలగాయని వివరించారు. తూర్పు డెల్టాలోని పంటలు తుదిదశకు చేరుకున్నాయి. ఇక్కడ పెద్దగా సాగునీటి అవసరాలు లేవు. పశ్చిమ డెల్టా పరిధిలో మొక్కజొన్న, జొన్న సాగు ఎక్కువగా ఉండటం, కొంత ఆలస్యంగా రబీలో పంటలు వేయడంతో మార్చి నెలాఖరు వరకు సాగునీటి అవసరాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 15 వరకు తూర్పు డెల్టా కాలువలకు, పశ్చిమ డెల్టా కాలువలకు నీరిచ్చేలా రోజువారీ ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. తాగునీటి చెరువులను నింపుతూ నీటి విడుదల ఆపే నాటికి వంద శాతం నీటినిల్వ సామర్థ్యంతో ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాగునీటి చెరువుల్లో నిల్వ చేసిన నీరు సగటున 90 రోజుల వరకు సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈలెక్కన జులై నెలలో మళ్లీ కాలువలకు నీటిని విడుదల చేస్తారు.

# విపక్ష హోదా ఇవ్వాలంటేనే వణుకు



అమరావతి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు పొడుతూ అసెంబ్లీలో అసలు ప్రధాన ప్రతిపక్ష గుర్తింపునే ఇవ్వకుండా, ప్రశ్నించే గొంతు వినిపించకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మండిపడ్డారు. ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు అంటే ఏదో రాజకీయపరమైన హోదాగా కూటమి పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు అనేది ఒక బాధ్యత, దీనివల్ల అసెంబ్లీలో ఎక్కువ సమయం ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు ఉండే అవకాశం వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. దీనిని కూడా వక్రీకరించడం దుర్మార్గమన్నారు. ఏపీ అసెంబ్లీలో నాలుగు పార్టీలు ఉంటే, దానిలో మూడు పార్టీలు ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నాయి. మిగిలిన వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాల్సి ఉంది. పార్లమెంట్ చట్టం 1977 ప్రకారం సభలో సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రధాన ప్రతిపక్షంను గుర్తించాలి. కూటమి ప్రభుత్వం దీనిని ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపును వైఎస్సార్‌సీపీ కోరుతుంటే దీనిని రాజకీయం చేయడం దుర్మార్గం. దీనిపై కూటమి పార్టీలు చేస్తున్న ఈ విమర్శలను చూసి ప్రజాస్వామికవాదులే ఆశ్చర్యపోతున్నారని అన్నారు. ÷రిమ్మిది నెలల కూటమి పాలనపై ఇప్పటికే ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత ప్రారంభమైంది. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎక్కడా నెరవేర్చడం లేదు. మరోవైపు గ్రూప్-2 నిరుద్యోగులు, మిర్చి రైతులు, విద్యుత్ చార్జీల భారాన్ని మోయలేని ప్రజలు బాహాటంగానే ప్రభుత్వం మీద తమ నిరసనను తెలియచేస్తున్నారు. వీటన్నింటినీ ప్రజల పక్షాన ఎక్కడ వైఎస్సార్‌సీపీ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగడుతుందోననే భయంతోనే కూటమి ప్రభుత్వం ఉంది. న్యాయంగా వైఎస్సార్‌సీపీకి దక్కాల్సిన ప్రధాన ప్రతిపక్ష గుర్తింపును దూరం చేస్తూ, ప్రజా సమస్యలపై ఎక్కడ వైఎస్సార్‌సీపీ తమను ప్రశ్నిస్తుందోనని కంగారుపడుతోంది. ప్రతిపక్షంగా అడిగే ప్రశ్నలకు అసెంబ్లీలో సమాధానం చెప్పుకోలేని నిస్సహాయ స్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. తమ పాలనా వైఫల్యాలను ప్రజాగొంతుకగా వైఎస్సార్‌సీపీ సభలో వినిపిస్తే తట్టుకోలేమనే ఉద్దేశంతోనే ప్రధాన ప్రతిపక్ష గుర్తింపును నిరాకరిస్తున్నారన్నారు. శాసనమండలిలో ఇప్పటికే ప్రధాన ప్రతిపక్షంగా వైఎస్సార్‌సీపీ అనేక ప్రజా సమస్యలపై మాట్లాడుతోంది. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు ఉండటం వల్ల వైఎస్సార్‌సీపీ సభ్యులకు ఎక్కువ సమయం లభిస్తోంది. తాజాగా వైస్ చాన్సలర్ల బలవంతపు రాజీనామాలపై ప్రభుత్వాన్ని నిలదీయడంతో సమాధానం చెప్పలేక కూటమి ప్రభుత్వం కంగారు పడింది. గవర్నర్ ప్రసంగంలో మాట్లాడించిన మాటలు, చెప్పించిన అబద్దాలపై నిలదీయడంతో అధికారపక్షం నీళ్ళు నమిలింది. తమ తప్పులను ఒప్పుకోవాల్సిన పరిస్థితిలో పడింది.ప్రజాస్వామ్యంలో అధికారపక్షానికి ఎంత బాధ్యత ఉంటుందో, ప్రధాన ప్రతిపక్షంకు అంతకంటే ఎక్కువ బాధ్యత ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తెలుగుదేశానికి ప్రతిపక్షంగా చట్టసభల్లో మాట్లాడేందుకు ఎంతో సమయం లభించింది. సభలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా చర్చలు జరిగితే వాటిని అర్థవంతమైనవని అంటారా? ప్రధాన ప్రతిపక్షంగా ప్రశ్నించే వాటికి ధీటుగా సమాధానం చెప్పగలిగితేనే కూటమి ప్రభుత్వ పాలనా సామర్థ్యం ప్రజలకు తెలుస్తుందన్నారు.. ఇటువంటి సంప్రదాయాలకు తిలోదకాలు ఇస్తూ, అసలు ప్రధాన ప్రతిపక్ష గుర్తింపే లేకుండా, ప్రశ్నించేవారే లేకుండా ఏకపక్షంగా పాలనను సాగించాలని అనుకోవడం నిరంకుశత్వం అవుతుంది. సంఖ్యాబలం రీత్యా మాకే ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు వస్తుందంటే, జనసేన పార్టీ కూటమి ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు.

# మళ్లీ కవిత మెడకు లిక్కర్ ఉచ్చు



న్యూఢిల్లీ,ఢిల్లీ లిక్కర్ స్కాంలో తీగలాగితే డొంక కదులుతోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా అసెంబ్లీ వేదికగా కాగ్ రిపోర్ట్ ను బయటపెట్టారు. ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం అధికారంలో రాగానే తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే కాగ్ రిపోర్ట్ బయటపెట్టడంతో లిక్కర్ స్కాం మరో మారు చర్చకు దారి తీసింది. ఈ స్కాంలో చిక్కుక్కున్నఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ , మాజీ డిప్యూటి సిఎం మనీష్ సిసోడియా ఇప్పటికే బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్ కూతురు కవిత ఈ లిక్కర్ స్కాంలో కింగ్ పిన్ . సౌత్ గ్రూప్ కు చెందిన కవిత అప్పటి ఆప్ ప్రభుత్వాన్ని ప్రభావితం చేశారు. ఇటీవల జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓడిపోవడానికి లిక్కర్ స్కాం ప్రధాన కారణం. ఢిల్లీ లిక్కర్ పాలసీపై 166 పేజీల కాగ్ రిపోర్ట్ లో రెండువేల కోట్ల స్కాం జరిగినట్టు ముఖ్యమంత్రి రేఖా గుప్తా వెల్లడించారు. నవంబర్ 2021 నుంచి సెప్టెంబర్ 2022 వరకు ఢిల్లీలో నూతన మద్యం విధానం కొనసాగింది. ఈ స్కాం వెలుగులోకి రావడంతో ఢిల్లీ లిక్కర్ పాలసీ రద్దయ్యింది. అప్పటి నుంచి తెలంగాణ పాలిటిక్స్ హీటెక్కాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో లిక్కర్ స్కాం ప్రచార అంశంగా మారిపోయింది.

తెలంగాణలో వరుసగా మూడోసారి అధికారంలో రావాలనుకున్న బిఆర్ఎస్ కుప్పకూలడానికి లిక్కర్ స్కాం ముఖ్య భూమిక వహించింది. బిజెపి, బిఆర్ఎస్ దోస్తీ బలపడటానికి లిక్కర్ స్కాం ఓ టూల్ మాదిరిగా మారిపోయింది. ఎన్నికల ఫలితాల్లో బిఆర్ఎస్ ఓడిపోవటంతో బిజెపి కూడా దూరమైంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బిఆర్ ఎస్ కు తగిన సంఖ్యాబలం కూడా లేదు. 10 మంది బిఆర్ ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అధికారానికి పదేళ్లు దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి కవిత లిక్కర్ స్కాం రాజకీయ మైలేజీ ఇచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి లిక్కర్ స్కాం ఓ కారణమనే చెప్పాలి. లిక్కర్ స్కాంలో ఇరుక్కున్న కవితను రిలీజ్ చేయడానికి బిజెపి కవితకు సపోర్ట్ చేయలేదు. బిఆర్ ఎస్ రాజకీయంగా దెబ్బతినడమే కారణమైంది. . అదే సమయంలో బిజెపి కూడా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీతో తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. పర్యవసనాంగా కవిత తీహార్ జైల్లో ఊచలు లెక్కపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కవితకు బెయిల్ లభించకపోవడంతో బిఆర్ఎస్ ను బిజెపి లో విలీనం దిశగా చర్చలు జరిగాయి. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ విలీన ప్రతిపాదనను ఆమోదం పలికినప్పటికీ బిఆర్ ఎస్ వ్యవస్థాపకులు కెసీఆర్ మాత్రం వెనకడుగు వేయడంతో కవిత జైల్లో పర్మినెంట్ ఖైదీ అని ప్రచారం జరిగింది. ఎట్టకేలకు కోర్టు బెయిల్ ఇవ్వడంతో కవిత బయటకొచ్చారు. గత దసరాకు ముందే ఆమె ఇంటికి వచ్చినప్పటికీ బతకమ్మ వేడుకలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన కవిత గైనకాలజీ సమస్యలతో ఇంటికే పరిమితమయ్యారు. తీహార్ జైలు నుంచి విడుదలయ్యాక కవిత క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. కార్ రేస్ స్కాంలో అన్న కెటీఆర్ అరెస్ట్ తప్పదని ప్రచారం జరగడంతో కవిత మళ్లీ యాక్టివ్ అయ్యారు. రేవంత్ సర్కార్ పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తూ వచ్చారు. కవిత ఆరోపణలతో బిజెపి బిఆర్ఎస్ బంధం మళ్లీ బలపడిందనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణ ఎంఎల్ సి ఎన్నికల్లో బిజెపి లాభపడే విధంగా బిఆర్ ఎస్ పావులు కదిపింది. కాంగ్రెస్ ను మట్టికరిపించడానికి బిఆర్ఎస్ కీలకమైన ఎంఎల్ సి ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. బిఆర్ఎస్ తటస్థం కావడంతో బిజెపి రాజకీయ ప్రయోజాలు మరింత బలపడ్డాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి లాభపడే విధంగా బిఆర్ఎస్ పావులు కదుపుతోంది. ఢిల్లీ బిజెపి బిఆర్ఎస్ ను శత్రువుగా పరిగణిస్తే కేంద్ర నాయకత్వం మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తుందని అర్థం చేసుకోవాలి. కవితను అడ్డు పెట్టుకుని బిజెపి తన రాజకీయ ప్రయోజనాలను కాపాడుకుంటోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com